నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644

**నీలగిరి నిత్యపద్యం**
**ఆటవెలది**

పరిమలమ్మునను‌చు విరివిగా గంధమున్
పూసుకోకు మెపుడు వాసనలను
అతిగనేదియైన హానియే కలిగించు
విజయలక్ష్మి వాక్కు వినురనరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 3 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 28-06 -2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# ఇంకెన్ని పరీక్షలు లీక్ చేస్తారు?



- మహారాష్ట్రలో టెట్ పేపర్ లీక్‌పై విపక్షాల విరుచుకుపాటు
- బీజేపీ ప్రభుత్వంపై విమర్శల వెల్లువ
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం: రాహుల్
- లీకులపై సమగ్ర విచారణకు డిమాండ్

**న్యూఢిల్లీ:**
దేశంలో లీక్ చేయడానికి ఇంకా ఏవైనా పరీక్షలు మిగిలున్నాయా అంటూ బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దేశంలో వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే నీట్ పేపర్ లీకేజీ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించగా, ఇప్పుడు

-మిగతా 2 లో

# హార్ముజ్ లో మళ్లీ ఉద్రిక్తతలు



- ఇరాన్ క్షిపణి, డ్రోన్ స్థావరాలపై అమెరికా ప్రతీకార దాడులు
- బహ్రెయిన్ సహా గల్ఫ్ లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ ఎటాక్

**టెహ్రాన్ :-**
ఒకవైపు అమెరికా, ఇరాన్ మధ్య దౌత్యపరమైన చర్చలు జరుగుతుండగానే, మరోవైపు ఇరు దేశాలు పరస్పరం దాడులకు దిగాయి. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ వాతావరణం నెలకొంది. హార్ముజ్ లో మళ్లీ పరిస్థితులు ఉద్రిక్తతంగా మారాయి. ఇరాన్ దళాలు వాణిజ్య నౌకపై డ్రోన్ దాడికి పాల్పడటంతో, దానికి ప్రతిచర్యగా

-మిగతా 2 లో



## నేడు నల్లగొండకు సీఎం

- రూ.13వేల కోట్ల భారీ బడ్జెట్ ప్రాజెక్టులకు శ్రీకారం
- జిల్లా అధికారులు, పార్టీ శ్రేణులతో ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రి కోమటిరెడ్డి
- పర్యటనలో సీఎం ఇచ్చే హామీలపై కోటి ఆశలు!

**హైదరాబాద్ :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుదీర్ఘ కాలం తర్వాత నల్లగొండ జిల్లాకు ఆదివారం పర్యటించనుండటంతో రాజకీయాల్లో ఉత్కంఠగా సీన్ మారింది. రూ. 13 వేల కోట్ల భారీ బడ్జెట్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనుండగా అధికార కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ నెలకొంది. సీఎం పర్యటన సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా అధికారులు, పార్టీ శ్రేణులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే జిల్లాలో తీవ్ర నిరుద్యోగ సమస్యపై సీఎం ఎలాంటి స్పష్టత ఇస్తారనే ఉత్కంఠ నెలకొంది. నల్లగొండ, చౌటుప్పల్, మిర్యాలగూడ, నార్కట్‌పల్లి ప్రాంతాల్లో వందలాది ఫార్మా కెమికల్, సిమెంట్, రైస్ మిల్లుల పరిశ్రమలు ఉన్నాయి.

-మిగతా 2 లో

# వీబీ గ్రామ్ జీని అంగీకరించం

## రాష్ట్రాల అధికారాలను లాక్కునేందుకు కేంద్రం కుట్ర

- కర్నాటక, కేరళం రాష్ట్రంతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధం
- జులై 2న రాష్ట్ర క్యాబినెట్‌లో తుది నిర్ణయం
- మంత్రివర్గ ఉపసంఘం చైర్మెన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**హైదరాబాద్ :-**
వీబీ గ్రామ్ జీ చట్టం--2025ను తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ యథాతథంగా అంగీ కరించబోదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం రెండో సమావేశం నిర్వహించారు. మంత్రులు దనసరి అనసూయ సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, గడ్డం వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనోపాధికి వెన్నెముకగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ రాష్ట్రాల

-మిగతా 2 లో





## ఆఫ్ఘనిస్థాన్‌లో 6.2 తీవ్రతతో భూకంపం..

- భారత్ సహా పలు దేశాల్లో ప్రకంపనలు
- భయాందోళనలో స్థానికులు: బయటకు పరుగులు
- 215 కి.మీ లోతులో భూకంప కేంద్రం
- అప్రమత్తమైన యంత్రాంగం: నివేదికల సేకరణ

**న్యూఢిల్లీ: :-**
ఆఫ్ఘనిస్థాన్‌లోని హిందూ కుష్ ప్రాంతంలో 6.2 తీవ్రతతో భూకంపం సంభవించింది. భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి 7:04 గంటలకు ఈశాన్య ఆఫ్ఘనిస్థాన్‌లో భూమి లోపల 215 కిలోమీటర్ల లోతులో ఈ భూకంపం కేంద్రీకృతమైంది. కలాఫ్‌గాన్‌కు సుమారు 81 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆఫ్ఘనిస్థాన్‌తోపాటు పాకిస్థాన్, భారత్, చైనా, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, కిర్గిజ్‌స్థాన్, తుర్క్‌మెనిస్థాన్‌లో భూ ప్రకంపకనలు నమోదయ్యాయి.కాగా, ఆఫ్ఘనిస్థాన్‌లో

-మిగతా 2 లో



## జూలై 2 వరకు విస్తారంగా వానలు

- పుంజుకుంటున్న నైరుతి రుతుపవనాలు
- చురకుగా కదులుతున్నాయన్న వాతావరణ శాఖల
- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్
- 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు
- హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

2 లో

## అప్పుల ఊబిలో పాక్!..

రూ 81.9 ట్రిలియన్లకు చేరిన రుణం




2 లో

## మునుపటిలా అదనపు సుంకాలు విధిస్తాం..

- భారత్‌కు అమెరికా హెచ్చరిక



2 లో

## నేడు పల్స్ పోలియో

- రాష్ట్రవ్యాప్తంగా 22,979 బూత్‌లు
- సుమారు 40.97 లక్షల మంది
- చిన్నారులకు పోలియో చుక్కలు



2 లో

# హైడ్రాతో కాంగ్రెస్ దుర్మార్గాలు



## రాష్ట్రంలో వికాసం పోయి విధ్వంసమే మిగిలింది

- ఫ్యూచర్‌సిటీ పేరిట రేవంత్ బంధువుల భూ దందా
- ఎస్సీ, ఎస్టీ, అసైన్డ్ భూములు దోచుకుంటున్నరు
- ఫార్మాసిటీ భూములను ఫ్యూచర్‌సిటీకి వాడుతుండ్రు
- పెట్టుబడులు పెట్టాలనుకునేవారు ఆలోచించుకోవాలి
- మహేశ్వరంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- విరుద్ధంగా భూములు కేటాయిస్తే చట్టం ఊరుకోదు
- ఎన్నికలెప్పుడొచ్చినా కాంగ్రెస్ బంగాళాఖాతంలోకే
- సర్, సభ్యత్వంపై మహేశ్వరంలో శ్రేణులకు దిశానిర్దేశం

2 లో

అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దుచేసి ఆ భూములను తిరిగి రైతులకే ఇస్తామని ప్రగల్భాలు పలికిన భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, కోదండరాం, మల్‌రెడ్డి రంగారెడ్డి, కోదండరెడ్డి వంటివారు ఆ భూములను రైతులకు ఎందుకు తిరిగి ఇవ్వలేక పోయిండ్రు? ఫ్యూచర్‌సిటీ పేరు చెప్పుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులు, ఆ ప్రాంత కాంగ్రెస్ నాయకులు రియల్ ఎస్టేట్ దందా కొనసాగిస్తున్నరు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ భూములు, అసైన్డ్, ప్రభుత్వ భూములను టార్గెట్ చేసి లాక్కుంటున్నరు.



## రాజధానిలో రౌడీయిజమా..?

- అమరావతిలో అడుగుపెట్టే నైతిక అర్హత వైసీపీకి లేదు
- వైసీపీ నేతలను అడ్డుకున్నది భూమిలిచ్చిన రైతులనేనని వెల్లడి
- 2027 నాటికి అమరావతి నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యం
- ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశాలు
- రాజధాని రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం
- రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత

**అమరావతి**
అమరావతిలో వైఎస్సార్సీపీ సీఆర్డీఏ రైతు పరిరక్షణ కమిటీ పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్త ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. అమరావతిలో పర్యటించే నైతిక అర్హత వైఎస్సార్సీపీ నేతలకు లేదని ఆమె స్పష్టం చేశారు. రైతులను పరామర్శించడానికి వచ్చారా, లేక రాజధానిలో రౌడీయిజం చేయడానికి వెళ్లారా అని ప్రశ్నించారు. వైఎస్సార్సీపీ నేతల వెంట ఎంతమంది రౌడీషీటర్లు వచ్చారో పోలీసు శాఖ వద్ద పూర్తి వివరాలు ఉన్నాయని హోంమంత్రి తెలిపారు. గతంలో తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసిన వ్యక్తుల్లో కొందరు కూడా వైసీపీ నేతల వెంట కనిపించారని, అందుకు సంబంధించిన

-మిగతా 2 లో



## సంజీవిని గేమ్‌ఛేంజర్ పథకం

- ఆగస్ట్ 15 నుంచి అన్ని జిల్లాల్లో అమలు
- మార్కాపురంను జిల్లా చేసి మాట నిలబెట్టాం
- రైతులు సేంద్రియ వ్యవసాయం దిశగా సాగాలి
- సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు

**మార్కాపురం, :-**
ప్రజల అండ ఉంటే కొండనైనా ఢీ కొట్టే శక్తి తనకు వస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కాపురంను ప్రత్యేక జిల్లాగా చేసి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామన్నారు. కిష్టంశెట్టిపల్లిలో పర్యటించిన ఆయన.. సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రజలు ఆనందంగా ఉండేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం సంజీవని లాంటి వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. సంజీవని పథకం ఒక గేమ్ ఛేంజర్ అని అన్నారు. ఆగస్టు 15 నుంచి అన్ని జిల్లాల్లో సంజీవని పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. యోగా, ధ్యానం వంటి మంచి అలవాట్లతో మీ ఆరోగ్యం.. మీ చేతుల్లోనే ఉంటుంది. పిల్లలకు పౌష్టికాహారం పెట్టాలి.. తాజా ఆహారం తీసుకోవాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. వీలైనంత వరకు ఎరువులు తక్కువగా వాడాలి. యూరియా ఎక్కువ వేస్తే పంటను

-మిగతా 2 లో

# ఇంకెన్ని పరీక్షలు లీక్ చేస్తారు?

మొదటి తరువాయి

మహారాష్ట్రలో టెట్ పరీక్ష పేపర్ లీకవ్వడం కలకలం సృష్టిస్తోంది. వీటిలో నీట్ జాతీయస్థాయి పరీక్ష కాగా, మహారాష్ట్ర టెట్ రాష్ట్రస్థాయి పరీక్ష. ఇటు దేశంలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయే, అటు మహారాష్ట్రలో బీజేపీ ఆధ్వర్యంలోని మహాయుతి ప్రభుత్వాలే అధికారంలో ఉండటం విశేషం. ఈ నేపథ్యంలో పేపర్ లీకేజీ ఘటనల్లో బీజేపీ నిర్లక్ష్యంపై కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ), కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. "మరో పేపర్ లీకేజీ. మరో పరీక్ష రద్దు. ఈసారి మహారాష్ట్ర టెట్. దేశంలోని విద్యావ్యవస్థ, పరీక్షా నిర్వహణ వ్యవస్థ ఒక దోపిడీ వ్యవస్థగా మారింది. దేశంలోని ప్రతి యువకుడు అభద్రతతో ఉన్నాడు. ఇది పేపర్ లీకేజీ కాదు. యువత భవిష్యత్తును కొల్లగొట్టడం" అంటూ రాహుల్ గాంధీ స్పందించారు. శరద్ పవార్ వర్గానికి చెందిన ఎన్సీపీ నేత అమోలో మాటెలె కూడా టెట్ పేపర్ లీకేజీపై విమర్శలు గుప్పించారు. ఇంతకుముందు సీబీఎస్ఈ, నీట్ యూజీ పేపర్లు లీకవ్వగా, ఇప్పుడు టీచర్ల అర్హత పరీక్ష పత్రం లీకైందన్నారు. మిగతా పోటీ పరీక్షల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇటు పేపర్లు లీకవుతుంటే ప్రభుత్వం మాత్రం ఇతర పార్టీల్ని కొల్లగొట్టి, ఎంపీల్ని చేర్చుకోవడంలో బిజీగా ఉందన్నారు. ఈ ప్రభుత్వం లీకేజీలు, కుట్రలకు కేంద్రంగా మారిందన్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కె మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రభుత్వానికి పరీక్షలు నిర్వహించే సత్తా లేదని విమర్శించారు. పార్టీల్ని విడదీయడం, ఎంపీల్ని, ఎమ్మెల్యేల్ని కొనడం మీదే దృష్టి పెట్టిందన్నారు. పేపర్లు లీక్ చేయడానికి దేశంలో ఇంకా ఏమైనా పరీక్షలు మిగిలి ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. ఆదివారం జరగాల్సిన మహారాష్ట్ర టెట్ పరీక్ష లీక్ కారణంగా రద్దైన సంగతి తెలిసిందే. ఈ పేపర్ లీకేజీపై విచారణ జరుగుతోంది.

# హార్ముజ్ లో మళ్లీ ఉద్రిక్తతలు

మొదటి తరువాయి

అమెరికా సైన్యం ఇరాన్ భూభాగంలోని కీలక క్షిపణి, డ్రోన్ నిల్వ కేంద్రాలు, తీరప్రాంత రాడార్ స్థావరాలే లక్ష్యంగా భీకర దాడులు నిర్వహించింది.

అయితే, ఈ కాల్పుల విరమణ ఒప్పంద గడువు ముగియక ముందే ఇరాన్ దానిని ఉల్లంఘించిందని అమెరికా ఆరోపించింది. అంతర్జాతీయ వాణిజ్య నౌకలపై ఇరాన్ దళాలు జరిపిన దాడులకు సమాధానంగానే తాము ఈ శక్తివంతమైన ప్రతిదాడి చేయాల్సి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికారికంగా ప్రకటించింది. ఈ దాడుల తీవ్ర తకు దక్షిణ ఇరాన్‌లోని వ్యూహాత్మక ప్రాంతమైన సిరిక్ సమీపంలో వరుసగా మూడు కంటే ఎక్కువ భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు ఇరాన్ ప్రభుత్వ అధికారిక వార్తా ఛానల్ ఐఆర్ఐబీ పేర్కొంది.

**అమెరికా సైనిక స్థావరాలపై దాడులు చేశాం: ఇరాన్**

అమెరికా జరిపిన వైమానిక దాడులకు ప్రతీ కారంగా తాము కూడా ఈ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులతో దాడులు చేసినట్లు ఇస్లామిక్ రివల్యూ షనరీ గార్డ్ కార్ప్స్ (ఐజీఆర్సీ) ప్రకటించింది. అమెరికా తమ డ్రోన్, రాడార్ కేంద్రాలను దెబ్బ తీసినందుకు బదులుగానే ఈ ప్రతిదాడి జరిపినట్టు పేర్కొన్నప్పటికీ, భద్రతా కారణాల దృష్ట్యా అమెరికాకు చెందిన ఏ నిర్దిష్ట స్థావరాలపై దాడులు చేశారనే పూర్తి వివరాలను ఇరాన్ సైన్యం వెల్లడించలేదు.

**ఖండించిన ట్రంప్**

ఇరాన్ దాడిని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా ఖండించారు. హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ కనీసం నాలుగు డ్రోన్లను ప్రయోగించిందని ఆయన వెల్లడించారు. ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లలో మూడింటిని తమ సాయుధ దళాలు గాల్లోనే విజయవంతంగా కూల్చివేసాయని పేర్కొన్నారు. కానీ, దురదృష్టవశాత్తూ ఒక డ్రోన్ అత్యంత ఖరీదైన పెద్ద కార్గో నౌక పైభాగంలో బలంగా దూసుకెళ్లిందన్నారు. దీనివల్ల ఆ నౌకకు కొంత నష్టం వాటిల్లిందని ట్రంప్ చెప్పారు. ఇరాన్ చేసిన ఈ పని స్పష్టంగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిం చడమే అని ట్రంప్ స్పష్టం చేశారు. కాల్పుల విరమ ణకు సంబంధించి అమెరికా, ఇరాన్ దేశాలు ఇటీవలే ఒక అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం ఇరాన్ ఎలాంటి అదనపు రవాణా రుసుములు లేదా ఆంక్షలు విధించకుండా 60 రోజుల పాటు హార్ము జ్ ద్వారా అంతర్జాతీయ వాణిజ్య నౌకల రాకపోకలను సజావుగా సాగనివ్వా లి. ఇందుకు బదులుగా అమెరికా సైన్యం ఆ ప్రాంతం లో విధించిన నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేసి, ఇరాన్‌తో 60 రోజుల పాటు దౌత్యపరమైన అణు చర్చలు ప్రారంభించడానికి అంగీకరించింది.

# ఆఫ్ఘనిస్థాన్‌లో 6.2 తీవ్రతతో భూకంపం..

మొదటి తరువాయి

భూకంపం కారణంగా, శనివారం సాయంత్రం ఢిల్లీ, జమ్మూకశ్మీర్‌తో పాటు ఉత్తర భారత రాష్ట్రాల్లో బలమైన భూ ప్రకంపనలు సంభవించాయి. ఈ భూకంప కేంద్రం ఆఫ్ఘనిస్థాన్‌లో ఉన్నదని, రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.2గా నమోదైనట్లు భూకంప కార్యకలాపాలను పర్యవేక్షించే 'నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ' వెల్లడించింది. అయితే ప్రాణ, ఆస్తి నష్టాల వివరాలు ఇంకా తెలియలేదు.

# నేడు నల్లగొండకు సీఎం

మొదటి తరువాయి

స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో జరుగుతున్న అన్యాయంపై తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇక్కడి పరిశ్రమల్లో మేనేజ్మెంట్, టెక్నికల్, ఆఫీస్ జాబ్ లన్నీ ఇతర జిల్లాల వారికి, వేరే రాష్ట్రాల వారికి కట్టబెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానికులకు కేవలం స్వీపింగ్, సెక్యూరిటీ గార్డు, డైలీ లేబర్ వంటి తక్కువ జీతం వచ్చే శారీరక శ్రమతో కూడిన పనులు మాత్రమే ఇస్తున్నారు. పరిశ్రమల యాజమాన్యాలు స్థానిక కోటాను అమలు చేసేలా సీఎం రేవంత్ తన పర్యటనలో కఠినమైన ఆదేశాలు జారీ చేయాలని, లేదా జిల్లాకు ప్రత్యేకంగా ఐటీ టవర్స్, కాలుష్య రహిత ఉపాధి కల్పించే పరిశ్రమలను ప్రకటించాలని నిరుద్యోగ యువత కోరుతున్నారు.

**హైమ్ రోడ్ల ప్లాన్ ఆవిష్కరణ**


సీఎం పర్యటనలో భాగంగా కనగల్ మండలంలో ఏపీసీ మార్కెట్ యార్డ్ వద్ద ఆర్ అండ్ బి 'హైమ్' రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్లాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం నల్లగొండ కార్పొరేషన్ పరిధిలో తొలి విడత తాగునీటి సరఫరా ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేస్తారు. ఎస్పీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో సీఎం మాట్లాడతారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళా ప్రతినిధులకు కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆర్థిక సాయం, బ్యాంక్ లింకేజీ చెక్కులను పంపిణీ చేస్తారు.

**వరాలు కురిపించే..?**

రూ. 13 వేల కోట్ల రోడ్ల నెట్‌వర్క్, జిల్లా ముఖ్యత్రాన్ని మార్చునున్నప్పుడికే దశాబ్దాలుగా వేధిస్తున్న కీలక సమస్యలపై సీఎం ఎలాంటి ప్రకటన చేస్తారనే ఉత్కంఠ నెలకొంది. జిల్లాలోని పరిశ్రమల్లో 75 శాతానికి పైగా ఉద్యోగాలు దక్కేలా చట్టాన్ని కఠినతరం చేసే ప్రస్తావన వేదికపై నుంచే వస్తారా అనే చర్చ జరుగుతున్నది. హైదరాబాద్ శివార్ల నుంచి నల్లగొండ మీదుగా ప్రవహిస్తున్న మూసీ నది ప్రక్షాళనపై ప్రత్యేక ప్యాకేజీ లేదా కార్యచరణ ప్రకటిస్తారా..! అని ఎదురుచూస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా నత్తనడకన సాగుతున్న శ్రీశైలం ఎడమగట్టు కాలువ సాగునీటి పనులకు నిధులు కేటాయించి, మునుగోడు, దేవరకొండ ప్రాంతాల సాగునీటి కష్టాలు తీర్చాలనే డిమాండ్ కూడా వినిపిస్తున్నది.ం

మునుపటిలా అదనపు సుంకాలు విధిస్తాం..

# మునుపటిలా అదనపు సుంకాలు విధిస్తాం..




**వాషింగ్టన్**

అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీషన్ గ్రీర్ ఈ వారంలో భారత్‌లో పర్యటిస్తున్న క్రమంలో ఆ దేశ ఖజానా కార్యదర్శి స్కాట్ బెసెంట్ ప్రపంచ దేశాలకు తాజా హెచ్చరిక జారీ చేశారు. అదనపు సుంకాలు విధించరాదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా 301 సెక్షన్ కింద ఆయా దేశాలపై అదనపు సుంకాలు విధిస్తామని ఆయన పేర్కొన్నారు.కాగా, భారత్-అమెరికా మొదటి విడత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ)ను ఖరారు చేసుకునేందుకు భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో గ్రీర్ చర్చలు జరిపారు. వాణిజ్య ఒప్పంద ఖరారుకు అతి దగ్గరలో ఉన్నట్టు ప్రకటించారు.

**ట్రంప్ సుంకాల హెచ్చరిక**

అమెరికన్ కంపెనీలపై డిజిటల్ సేవల పన్ను విధించే ఏ దేశం నుంచైనా వచ్చే అన్ని వస్తువుల పైనా 100 శాతం సుంకాన్ని విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు.

# వీబీ గ్రామ్ జీని అంగీకరించం

మొదటి తరువాయి

అధికారాలను కేంద్రం హరిస్తోందని విమర్శించారు. ఇది కేవలం ఉపాధి హామీ చట్ట సవరణ మాత్రమే కాదనీ, భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిపైనే జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను క్రమంగా తగ్గించి, గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల భవిష్యత్‌ను తాకట్టు పెట్టే చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయదని తేల్చి చెప్పారు. అవసరమైతే ఈ చట్టంపై సుప్రీంకోర్టులో సవాలు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందని చెప్పారు. సమాఖ్య వ్యవస్థను విశ్వసించే ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఉత్తమ్ పేర్కొన్నారు. కర్నాటక, కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రులతో సంప్రదింపులు జరిపి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని అన్నారు. సమావేశంలో పాల్గొన్న 20 పౌరసంఘాలు కేంద్ర ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం స్వంత ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని వారు సూచించారని చెప్పారు. 60 రోజుల ఉపాధి పరిమితిని పూర్తిగా వ్యతిరేకిస్తూ, ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల ఉపాధి కల్పించాలనీ, చట్టబద్ధ కనీస వేతనాలు చెల్లించాలని పౌరసంఘాలు ప్రభుత్వాన్ని కోరాయని మంత్రి వివరించారు. కేంద్రం ప్రతిపాదించిన 60:40 నిధుల భాగస్వామ్య విధానం తెలంగాణపై వేల కోట్ల రూపాయల అదనపు భారాన్ని మోపే ప్రమాదం ఉందనీ, ఈ అంశాన్ని రాష్ట్ర న్యాయశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు. పనితీరు బాగున్న రాష్ట్రాలను శిక్షిస్తూ, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించేలా కేంద్రం రూపొందించిన నిధుల కేటాయింపు విధానం అన్యాయమన్నారు. ఈ అంశంపై జులై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. సమీక్ష?లో పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ డి.దివ్య తదితరులు పాల్గొన్నారు.

# జూలై 2 వరకు విస్తారంగా వానలు

**-పుంజుకుంటున్న నైరుతి రుతుపవనాలు**
**-చురకుగా కదులుతున్నాయన్న వాతావరణ శాఖల**
**-పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్**
**-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు**
**-హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన**



హైదరాబాద్

నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి రోజులు గడుస్తున్నా వర్షాలు లేక తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు అందించింది. రుతుపవనాలు ఆలస్యంగా పుంజుకోవడంతో రాష్ట్రంలో వర్షపాతం కొరత ఏర్పడింది. అయితే తాజాగా రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, దీని ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా రానున్న ఏడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టంచేసింది. వాతావరణ కేంద్రం తాజా అంచనాల ప్రకారం.. ఇవాళ ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ రెండు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీచేశారు. వీటితోపాటు హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షసూచన నేపథ్యంలో వాతావరణ శాఖ తెలంగాణకు 'ఆరెంజ్ అలర్ట్' జారీచేసింది. జూలై 2వ తేదీ వరకు వర్షాలు కొనసాగుతాయని పేర్కొన్నది. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, ఒకటి రెండు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అదే సమయంలో దక్షిణ తెలంగాణ జిల్లాల్లో మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలే నమోదయ్యే సూచనలు ఉన్నాయని వివరించింది. ఇక రాజధాని హైదరాబాద్‌లోనూ వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండటంతో ఉక్కపోత నుంచి నగరవాసులకు ఉపశమనం లభించింది. ఇవాళ మధ్యాహ్నం తర్వాత తేలికపాటి జల్లులతో ప్రారంభమై, సాయంత్రం 6 గంటల తర్వాత వర్షం తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాత్రి వేళ నగరంలో భారీ వర్షం కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు.

# హైడ్రాతో కాంగ్రెస్ దుర్మార్గాలు

- **ఫ్యూచర్‌సిటీ పేరిట రేవంత్ బంధువుల భూ దందా**
- **ఎస్సీ, ఎస్టీ, అసైన్డ్ భూములు దోచుకుంటున్నరు**
- **ఫార్మాసిటీ భూములను ఫ్యూచర్‌సిటీకి వాడుతుండ్రు**
- **పెట్టుబడులు పెట్టాలనుకునేవారు ఆలోచించుకోవాలి**
- **మహేశ్వరంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **విరుద్ధంగా భూములు కేటాయిస్తే చట్టం ఊరుకోదు**
- **ఎన్నికలెప్పుడొచ్చినా కాంగ్రెస్ బంగాళాఖాతంలోకే**
- **సర్, సభ్యత్వంపై మహేశ్వరంలో శ్రేణులకు దిశానిర్దేశం**



రంగారెడ్డి,

రాష్ట్రం లో హైడ్రాను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ సర్కార్ అనేక దుర్మార్గాలకు ఒడిగడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యంగా అధికారపార్టీ నేతలు, హైడ్రాను పావుగా వాడుకుంటూ అనేక చోట్ల భూములు కాజేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ, అసైన్డ్ భూములను అధికార పార్టీ నేతలు, ముఖ్యమంత్రి బంధువులు కొల్లగొడుతున్నారని, ప్రజా అవసరాలు, పరిశ్రమల పేరిట ఎస్సీ, ఎస్టీ, అసైన్డ్, ప్రభుత్వ భూములు, కుంటలను కాజేసే కుట్రలకు తెగబడుతున్నారని ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో సర్, సభ్యత్వ నమోదుపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఫ్యూచర్‌సిటీ పేరిట రేవంత్ బంధువులు భూ దందాలకు తెరలేపారని ఆరోపించారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తామని చెప్తున్న ముఖ్యమంత్రి బీఆర్ఎస్ ప్రభుత్వం సేకరించిన 14 వేల ఎకరాల్లో మాత్రమే ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నారని చెప్పారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో ఫార్మాసిటీ నిర్మించాలన్న లక్ష్యంతో రైతులను ఒప్పించి 14 వేల ఎకరాలు సేకరించారని, ఆ భూమిని ఫ్యూచర్‌సిటీకి కేటాయించడం చట్ట విరుద్ధమని చెప్పారు.

**పెట్టుబడులపై ఆలోచించుకోవాలి**

ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులు పెట్టి కంపెనీలు ఏర్పాటు చేయాలనుకునేవారు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని, ఫార్మాసిటీ భూములను అక్రమంగా కేటాయించడం వల్ల పెట్టుబడులు పెట్టిన వారే నష్టపోతారని హితవుపలికారు. ముఖ్యంగా ముఖ్యమంత్రికే ఫ్యూచర్ లేదని, ఫ్యూచర్‌సిటీ కడుతామని గొప్పలు చెప్తున్నారని ఎద్దేవాచేశారు. మరోవైపు ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దుచేసి ఆ భూములను తిరిగి రైతులకే ఇస్తామని ప్రగల్భాలు పలికిన భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, కోదండరామ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, కోదండరెడ్డి వంటివారు ఆ భూములను రైతులకు ఎందుకు తిరిగి ఇవ్వలేక పోయారని ప్రశ్నించారు.

ఫ్యూచర్‌సిటీ పేరు చెప్పుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులు, ఆ ప్రాంత కాంగ్రెస్ నాయకులు రియల్‌ఎస్టేట్ దందా కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ భూములు, అసైన్డ్, ప్రభుత్వ భూములను టార్గెట్ చేసి లాక్కుంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న ఫార్మా కంపెనీల వల్ల హైదరాబాద్ ప్రజలు కాలుష్యం బారిన పడుతున్నారన్న దూరదృష్టితో రంగారెడ్డి జిల్లాలో కాలుష్య రహిత అంతర్జాతీయ ప్రమాణాలతో ఫార్మా కంపెనీలు నిర్మించాలని నిర్ణయించారని గుర్తుచేశారు.

ఈ ప్రాంతంలో కాలుష్య రహిత ఫార్మాసిటీని నిర్మిస్తే 5 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కేవని చెప్పారు. కానీ, ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు లేనిపోని దుష్ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించారని, ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతులకు తిరిగి ఇండ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వలేదని చెప్పారు.

# సంజీవిని గేమ్‌ఛేంజర్ పథకం

మొదటి తరువాయి

కొనేందుకు సిద్ధంగా లేరు. చాలా మంది ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు. భవిష్యత్‌లో పెద్ద కుటుంబాలను ఆదరిస్తాం. ఇంటి కోసం, రేషన్ కార్డు కోసం పిల్లలు, తల్లిదండ్రుల నుంచి విడిపోతున్నారు. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతోంది. జనాభా పెరగాల్సిన అవసరం ఉంది. 40 ఏళ్ల తర్వాత ఏం జరుగుతుందో దాని గురించి ఇప్పుడే ఆలోచిస్తాను. నా కంటే ఇన్నోవేషన్ తెచ్చేవారు ఎవరూ ఉండరు. ఇటీవల జెన్ జీ... జెన్ జీ మాట ఎక్కువగా వినిపిస్తోంది. నేనే అందరికంటే పెద్ద జెన్‌జీని. నా కంటే ఇన్నోవేటివ్‌గా ఆలోచించేవారు ఎవరూ ఉండరు. ఇన్నోవేషన్‌తో ముందుకు వస్తే అండగా ఉంటానని అన్నారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి. వెలిగొండ ప్రాజెక్టు.. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు జీవనాడి. ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం. గొడ్డలి పార్టీకి మద్దతు ఇచ్చేవారు ఆత్మవిమర్శ చేసుకోవాలి. అమరావతిపై వైకాపా కుట్రలు జరుగుతూనే ఉన్నాయి. అమరావతిని నంబర్ 1 నగరంగా, రాజధానిగా తీర్చిదిద్దుతాం. అమరావతి మా రాజధాని అని కాలర్ ఎగరేసి చెప్పుకొనేలా నిర్మిస్తాంఅని చంద్రబాబు అన్నారు. వైసీపీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శలు గుప్పించారు. ప్రజల కోసమే కూటమి ఏర్పడిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. 3 వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నామన్నారు. అన్నదాతలకు అండగా నిలుస్తున్నామని.. ఏటా రైతులకు రూ.20 వేలు ఇస్తున్నామని చెప్పారు. మనసున్న ప్రభుత్వం కాబట్టే ప్రజలకు అన్నీ చేస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పెరిగాయని.. ప్రైవేటు స్కూళ్ల నుంచి లక్ష మంది ప్రభుత్వ బడుల్లో చేరారని తెలిపారు. అందరికీ సంపూర్ణ ఆరోగ్యం కోసమే సంజీవని పథకాన్ని తీసుకొచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. ఎవరికైనా ఆరోగ్యం ఉంటేనే ఆనందమని.. సంజీవని ద్వారా వేగవంతంగా వైద్య సేవలు అందజేస్తామన్నారు. మన మిత్ర ద్వారా ఇంటి దగ్గరకే సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. 'భవిష్యత్తులో పిల్లలే మన ఆస్తి. ఒకరు వద్దు.. ముగ్గురు ముద్దు. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతోంది' అని అన్నారు.


# నేడు పల్స్ పోలియో

హైదరాబాద్

నేడు(ఆదివారం) రాష్ట్ర వ్యాప్తంగా పోలియో చుక్కలు వేయనున్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని వారికి ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వేసేలా వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలియో చుక్కలు వేసుకోకుండా ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా బూత్ లు, బృందాలు ఇంటింటి సర్వేల ద్వారా పోలియో డ్రాప్స్ అందించేలా చర్యలు తీసుకున్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోగా, మిగిలిపోయిన చిన్నారులకు ఈ నెల 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేసేందుకు ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలియో చుక్కల కోసం రాష్ట్రవ్యాప్తంగా 22,979 పోలియో బూత్ లు, 903 మొబైల్ బృందాలు, 903 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేశారు. సుమారు 40.97 లక్షల మంది 0-5 ఏళ్ల చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందుకోసం 52.04 లక్షల డీవీపీ డోసులను జిల్లాలకు సరఫరా చేశారు. పోలియో చుక్కల కార్యక్రమంలో 8,393 ఏఎన్ఎంలు, 27,181 ఆశా కార్యకర్తలు, 34,442 అంగన్‌వాడీ కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు.

# అప్పుల ఊబిలో పాక్!..

రూ 81.9 ట్రిలియన్లకు చేరిన రుణం




**న్యూఢిల్లీ**

పాకిస్థాన్ కేంద్ర ప్రభుత్వ అప్పులు చరిత్రలో ఎన్నడూ లేని స్థాయికి చేరాయి. ఏప్రిల్ నెలలోనే రూ.1.4 ట్రిలియన్ల మేర పెరగడంతో మొత్తం కేంద్ర ప్రభుత్వ అప్పులు రూ.81.93 ట్రిలియన్లకు చేరాయని 'బిజినెస్ రికార్డర్' నివేదిక వెల్లడించింది. ప్రభుత్వ పనులకు అప్పుల మీదనే ఆధారప డటమే ప్రధాన కారణం.పది నెలల్లోనే అప్పులు రూ.4 ట్రిలియన్లకు పైగా పెరిగాయి. ఇందులో దేశీయ అప్పులు రూ.3.6 ట్రిలియన్లకు పైగా ఉంటే, విదేశీ అప్పులు రూ.400 బిలియన్లుగా ఉన్నాయి.

# రాజధానిలో రౌడీయిజమా..?

మొదటి తరువాయి

దృశ్యాలు ప్రభుత్వానికి అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఉండవల్లి, పెనుమాక ప్రాంతాల్లో వైసీపీ నేతలను అడ్డుకున్న వారిలో 90 శాతం మంది అమరావతి రాజధాని కోసం భూములు ఇచ్చిన అసలైన రైతులని అనిత పేర్కొన్నారు. రైతుల ఆవేదన అర్థం చేసుకోకుండా వారిపైనే తప్పు మోపేలా వైసీపీ నేతలు మాట్లాడటం బాధాకరమన్నారు. వైసీపీ బృందం వెళ్తే ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు ముందుగానే హెచ్చరించినప్పటికీ, ఆ హెచ్చరికలను పట్టించుకోకుండా పర్యటన కొనసాగించారని విమర్శించారు. గతంలో అమరావతిని రాజధానిగా అంగీకరించిన వైసీపీ ప్రభుత్వం తర్వాత మూడు రాజధానుల పేరుతో ఉద్దేశపూర్వక రాజధాని అభివృద్ధిని అడ్డుకుందని హోంమంత్రి ఆరోపించారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని అమరావతి రైతులను పరామర్శించడానికి వచ్చారని ప్రశ్నించారు. అమరావతి పూర్తయితే వైఎస్సార్సీపీకి రాజకీయంగా మనుగడ ఉండదనే భయంతోనే ఇటువంటి డ్రామాలు చేస్తోందని ఆమె వివరించారు. కూటమి ప్రభుత్వం అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిని చేస్తోందని, 2027 నాటికి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నామని అనిత వెల్లడించారు. రాజధాని రైతుల ఆకాంక్షలను నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఉండవల్లి ఘటనలో జరిగిన రాద్ధాంతం, ఉద్రిక్త పరిస్థితులపై అధికారుల నుంచి పూర్తి వివరాలు తెప్పించుకున్నట్లు హోంమంత్రి తెలిపారు. వైఎస్సార్సీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుతో పాటు ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని చెప్పారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అమరావతి రైతులకు అండగా నిలబడినందుకు గతంలో తెలుగుదేశం పార్టీపై దాడులు జరిగాయని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి హింసాత్మక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించదని అనిత అన్నారు. వైఎస్సార్సీపీ నేతలను అడ్డుకున్నది టీడీపీ కార్యకర్తలు కాదని, రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులనేనని మరోసారి స్పష్టం చేశారు. అమరావతి రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఎలాంటి చర్యలైనా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని, రాజధాని నిర్మాణాన్ని అడ్డుకునే కుట్రలను ప్రజలే తిప్పికొడతారని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

# ఘనంగా మహనీయుల జయంతి ఉత్సవాలు



**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యాలయంలో మహనీయుల జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు, ఛత్రపతి శివాజీ, జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కొమురం భీమ్, బోజ్జా తారకం వంటి మహనీయుల ఆశయాలను ఆచరణలోకి తీసుకువెళ్లడం సమాజ అభివృద్ధికి అవసరమని అన్నారు. ప్రతి సంవత్సరం మార్చి 20 నుంచి జూన్ 27 వరకు మహనీయుల జయంతి ఉత్సవాలను రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మహనీయుల సిద్ధాంతాలతోనే పార్టీ పనిచేస్తుందని, యువతకు ఆ ఆలోచనలు మార్గదర్శకమని శివరాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పిఐ జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజేయ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సి. రమేష్ ముదిరాజ్, తెలంగాణ లేబర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమురయ్య ముదిరాజ్, అడ్వకేట్ పెండ్యాల అంజయ్య, పెద్దాల్ల చంద్రకాంత్ యాదవ్, కనకం రామకృష్ణ, తడికొప్పుల వినోద్ కుమార్, బల్లం రామకృష్ణ, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్ గోదాం కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్



**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలోని ఫర్టిలైజర్, సీడ్స్ గోదాముల్లో పనిచేస్తున్న హమాలి కార్మికులకు పని భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ డిమాండ్ చేశారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి రాష్ట్ర నాలుగో మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదాముల్లో పని చేసే కార్మికులకు ప్రమాద బీమా, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, లారీ దింపేటప్పుడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని, సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర మహాసభల్లో ఈ అంశంపై తీర్మానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హమాలి సంఘం అధ్యక్షుడు కడారి బీరయ్య, ఉపాధ్యక్షుడు ఆవుల లక్ష్మణ్, కార్యదర్శి రాజు, కోశాధికారి మామిళ్లపల్లి శంకరయ్య, నాయకులు రాయమల్లు, మహేష్, కొమురయ్య, అంజయ్య, సదయ్య, రాజయ్య, ఐలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులంలో ఇంటర్ సైన్స్ అడ్మిషన్లు ప్రారంభించాలని బీజేపీ డిమాండ్



**గంగాధర, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చొప్పదండి నియోజకవర్గంలోని కొలిమికుంట గురుకుల పాఠశాలలో హాస్టల్ వసతి లేకపోవడం కారణంగా నిలిపివేసిన ఎంపీసీ, బైపీసీ సెక్షన్లలో అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గత సంవత్సరం కూడా వసతి లేకపోవడంతో అడ్మిషన్లు నిలిపివేయడం వల్ల 160 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం కోల్పోయారని ఆయన వాపోయారు. జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి ఇంటర్ సైన్స్ విభాగంలో అడ్మిషన్లు ప్రారంభించాలని కోరారు. ఈ ప్రకటనలో బీజేపీ మండల అధ్యక్షుడు మొగిలి మహేష్, దొంతిసారపు సంపత్ పాల్గొన్నారు.

# నేడు మాజీ ఎమ్మెల్యే ద్యాప గోపాల్ రెడ్డి 100వ శతజయంతి ఉత్సవాలు

**కల్వకుర్తి, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు, మాజీ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్, డీసీసీ జిల్లా అధ్యక్షులు, కల్వకుర్తి సమితి అధ్యక్షులు ద్యాప గోపాల్ రెడ్డి 100వ శతజయంతి ఉత్సవాలు నేడు ఉదయం 11 గంటలకు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు మాజీ శాసనసభ్యులు, వివిధ పార్టీల నాయకులు హాజరుకానున్నారు. కాంగ్రెస్ నాయకులు శనివారం మీడియాకు మాట్లాడుతూ, "పార్టీలకు అతీతంగా అందరూ పాల్గొని ఈ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి" అని విజ్ఞప్తి చేశారు.

# కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేద్దాం

– పంజాల శ్రీనివాస్



**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజల సమస్యలపై సంఘటితంగా పోరాడి, కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గుంటూరుపల్లిలో సిపిఐ గ్రామ శాఖ ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వందేళ్లుగా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న పార్టీ సిపిఐ అని, సమ సమాజ స్థాపన కోసం కార్మిక వర్గ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏళ్లైనా ప్రజల జీవన ప్రమాణాలు మారలేదని, నిరుద్యోగం, అవినీతి, అక్రమాలు పెరుగుతున్నాయని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం అప్పులు పెంచి ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేస్తోందని ఆయన అన్నారు. పేదల సంక్షేమం కోసం పనిచేయకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఐ పోరాటాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు నలువాల సదానందం, శాఖ కార్యదర్శి సాయవేణి రాయమల్లు, సీనియర్ నాయకులు సామల్లా కొమురయ్య, చిందం మల్లయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## శాతవాహన గౌరవాధ్యక్షులను కలిసిన ఔట్సోర్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాతవాహన విశ్వవిద్యాలయం ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు గౌరవాధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సంఘాన్ని బలోపేతం చేసి ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. గౌరవాధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి కొత్త కార్యవర్గానికి అభినందనలు తెలియజేస్తూ ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఐకమత్యంతో పనిచేయాలని సూచించారు. అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అంజాద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మీస మాధురి, ఉపాధ్యక్షులు జ్ఞానేశ్వర్ రావు, కమల్ సింగ్, కోశాధికారి సాజిద్ పాషా, సంయుక్త కార్యదర్శులు డి. సంధ్య, కోట శ్రీనివాస్, ఇతర కార్యవర్గ సభ్యులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# జూలై 4న మూడో విడత అడ్మిషన్ల రిపోర్టింగ్ చివరి తేదీ

**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస**
శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో దోస్త్ మూడో విడతలో 8,394 సీట్లు కేటాయించినట్లు కోఆర్డినేటర్ డా. జాఫర్ జరీ తెలిపారు. మూడో విడతలో ప్రభుత్వ కళాశాలల్లో 1,160, మూడు అటానమస్ కళాశాలల్లో 1,478, ప్రైవేట్ కళాశాలల్లో 5,726 మంది విద్యార్థులకు సీట్లు లభించాయి. మొత్తం 37,620 సీట్లలో ఇప్పటివరకు మూడు విడతల్లో 14,708 సీట్లు కేటాయించబడ్డాయి. సీట్లు పొందిన విద్యార్థులు జూలై 4లోపు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలని, గడువులోగా పూర్తి చేయని పక్షంలో కేటాయించిన సీట్లు రద్దు అయ్యే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.

# అల్ఫోర్స్ విద్యార్థులకు ఒలింపియాడ్ ప్రశంసలు




**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు వివిధ ఒలింపియాడ్లలో ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. జనరల్ నాలెడ్జ్ ఒలింపియాడ్‌లో ఎస్వీ. కృష్ణచైతన్య, ఈ. లిఖిత్ కుమార్, రీజనింగ్ ఒలింపియాడ్‌లో రోహిత్ చంద్ర, లిఖిత్ కుమార్, సైన్స్ ఒలింపియాడ్‌లో పి. గౌరీ, ఏ. రిషిత్ చంద్ర, ఎన్. వినాయక్, ఎన్. సహ్రస్ విజయాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను సాధన చేస్తూ పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని సూచించారు. విజేతలకు పుష్పగుచ్ఛాలు, పతకాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ లో దోపిడి దొంగల బీభత్సం





**హుస్నాబాద్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పోలీస్ స్టేషన్ వెనకాలే ఉన్న మెయిన్ రోడ్డులో ఆరు దుకాణాలు, ఇళ్లలోకి దొంగలు చొరబడి బంగారం, నగదు అపహరించడం స్థానికంగా కలకలం రేపింది. అర్ధరాత్రి దుండగులు భవనంపైకి ఎక్కి అంతర్గత మెట్ల మార్గం గుండా లోపలికి ప్రవేశించి వరుసగా దుకాణాలు, ఇళ్లలోకి చొరబడి నగదు, ఆభరణాలను దోచుకెళ్లారు. మొదటి ఇంట్లో 20 తులాల బంగారం, రూ.50,000 నగదు, రెండో ఇంట్లో పావు తులం బంగారం, రూ.10,000 నగదు, మూడో ఇంట్లో రూ.12,000 నగదు అపహరించారని సమాచారం. మిగతా ఇళ్లలో పోయిన ఆభరణాలు, నగదు వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. బీరువాలు, వస్తువులు చెల్లాచెదురుగా చేసి వెళ్లిన దొంగల ధైర్యసాహసంపై వ్యాపార వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. పోలీస్ స్టేషన్ సమీపంలోనే ఈ ఘటన జరగడం సవాల్‌గా తీసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ, నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

# 48వ, 27వ డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన





**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నగరంలోని 48వ డివిజన్ కురుమవాడ ప్రభుత్వ పాఠశాల సమీపంలో రూ.20 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో డ్రైన్, సీసీ రోడ్డు పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. అదే రోజు 27వ డివిజన్ శివాజీ నగర్‌లో రూ.12 లక్షలతో డ్రైన్ పైప్‌లైన్, సీసీ ప్యాచ్ రోడ్డు పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేస్తూ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేటర్లు కర్రె పద్మ అనిల్, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, బండ రమణా రెడ్డి, గాజ రమా శివరామ్, పెద్దపల్లి శ్రీలేఖ జితేందర్, బోట్ల శ్యామల కిరణ్ కుమార్, నూనావత్ భాస్కర్ నాయక్, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

# ప్రతిభ కనబరిచిన ఎస్ఆర్ఆర్ విద్యార్థి మనోజ్ కుమార్



**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల బి.ఏ. విద్యార్థి కె. మనోజ్ కుమార్ ప్రతిష్ఠాత్మకమైన పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలో ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశం పొందడం పట్ల కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యం నుంచి ఉన్నత విద్యలో ప్రతిభ కనబరిచి దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందడం గర్వకారణమని అన్నారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో కృషి చేస్తే ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ డా. నితిన్ పాఠక్, అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కె. సురేందర్ రెడ్డి, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి ఎం. శ్రీనివాస్ రెడ్డి, విభాగాధ్యాపకులు వి. రాజేశం, కే. సుధాకర్, ఏ. రామ్‌కిషన్, జి. రాజేందర్, సిహెచ్. ప్రవీణ్, ఏ. సోమ నరసయ్య, శ్రీనివాస్ రావు, సతీష్ రెడ్డి, వినయ్ కుమార్ తదితరులు మనోజ్‌ను అభినందించారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# అలయన్స్ గ్రీన్ పోస్టర్ అవార్డ్స్ ప్రారంభం



**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 137-ఎ, కరీంనగర్ మరియు వాసుదేవా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న అలయన్స్ గ్రీన్ అవార్డ్స్ పోస్టర్ పోటీకి శ్రీకారం చుట్టారు. అచీవర్స్ స్కూల్‌లో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ పోటీని ప్రకృతి ప్రేరణ -- మన భవిష్యత్తు కోసం వాతావరణం అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. 4--8 ఏళ్ల విద్యార్థులు మొదటి కేటగిరీగా, 9--13 ఏళ్ల విద్యార్థులు రెండవ కేటగిరీగా పాల్గొనవచ్చు. జూలై 13లోపు పోస్టర్లను జిల్లా గవర్నర్ కార్యాలయానికి పంపాలి. విజేతలకు రూ.25,000, రూ.15,000, రూ.5,000 నగదు బహుమతులు అందజేయబడతాయి. ఈ సందర్భంగా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి వనరులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయిలో తొలిసారిగా ఈ అవార్డును స్కూల్ చైర్మన్ చెరిమాల వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ కొంజర్ల మహేష్, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఇతర నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రతిభ కనబరిచిన 50 మంది విద్యార్థులకు ప్రశంసా సర్టిఫికెట్లు అందజేశారు.

## 13వ వార్డులో ఎస్ఐఆర్ కార్యక్రమం



**హుస్నాబాద్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మున్సిపల్ 13వ వార్డులో స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ బొల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ వివరాలను అప్రమత్తంగా నమోదు చేసుకోవాలని, ఇంటింటికి తిరిగి ఫారాలు అందజేస్తూ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బిఎల్ఓ ఆర్‌పి యశోద, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

**-- ముప్పు శ్రీనివాస్**



**హుస్నాబాద్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎల్కతుర్తి మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకువచ్చి, ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాటం రాజు, పోలు కిరణ్, బొజ్జ సతీష్, బొజ్జ రాజయ్య, బొజ్జ రవీందర్, బొజ్జ గోపాల్, కంబాల రమేష్‌తో పాటు ముదిరాజు కులసంఘం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించండి -- పుష్పలత



**సుల్తానాబాద్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జూన్ 28న మున్సిపాలిటీ పరిధిలో జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత ప్రజలకు పిలుపునిచ్చారు. పుట్టినప్పటి నుండి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని ఆమె కోరారు. రెండు చుక్కలు -- ప్రతి చిన్నారికి, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పుష్పలత విజ్ఞప్తి చేశారు.

# జాతీయ భీమా అవగాహన దినోత్సవం

### - భవిష్యత్తుకు భరోసా




జూన్ 28న ప్రతి సంవత్సరం జరుపుకునే జాతీయ భీమా అవగాహన దినోత్సవం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని గుర్తు చేస్తుంది. జీవితం అనిశ్చితులతో నిండిన ప్రయాణం. ప్రమాదాలు, అనారోగ్యాలు, ప్రకృతి వైపరీత్యాలు, ఆస్తి నష్టాలు ఎప్పుడు ఎదురవుతాయో ఎవరికీ తెలియదు. ఇలాంటి సందర్భాల్లో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే రక్షణ కవచమే భీమా. భీమా భావన భారతదేశంలో కొత్తది కాదు. మనుస్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి, కౌటిల్యుని అర్థశాస్త్రం వంటి గ్రంథాలలోనే నష్టాలను పంచుకోవడం, పరస్పర సహకారం గురించి ప్రస్తావనలు ఉన్నాయి. ఆధునిక భీమా రంగానికి నాంది 1818 జూన్ 28న కోల్‌కతాలో ఓరియంటల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ స్థాపనతో పడింది. స్వాతంత్ర్యం అనంతరం ఎల్ఐసీ, సాధారణ భీమా సంస్థలు ఏర్పడి రంగం విస్తరించింది. నేటి కాలంలో ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు, పెరుగుతున్న వైద్య ఖర్చులు కుటుంబాలను ఒక్కసారిగా ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. కోవిడ్-19 మహమ్మారి తర్వాత ఆరోగ్య భీమా అవసరాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించారు. ఆసుపత్రి ఖర్చులు లక్షల్లో ఉండే ఈ రోజుల్లో భీమా లేకపోతే కుటుంబ పొదుపు మొత్తం ఖర్చవుతుంది. జీవిత భీమా కుటుంబానికి ఆదారమైన వ్యక్తి మరణించినప్పుడు ఆర్థిక భరోసా కల్పిస్తుంది. భీమా అనేది పాలసీదారు మరియు సంస్థ మధ్య జరిగే చట్టబద్ధమైన ఒప్పందం. చిన్న మొత్తంలో చెల్లించే ప్రీమియం భవిష్యత్తులో పెద్ద మొత్తంలో రక్షణను అందిస్తుంది. జీవిత భీమా, ఆరోగ్య భీమా, వాహన భీమా, గృహ భీమా, పంట భీమా వంటి అనేక రకాల భీమాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం కూడా ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా, సురక్షా బీమా యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా కోట్లాది ప్రజలకు తక్కువ ప్రీమియంతో భీమా రక్షణ అందిస్తోంది. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం, తక్కువ ఆదాయం కారణంగా ఇంకా అనేక కుటుంబాలు భీమా పరిధిలోకి రాలేదు. డిజిటల్ యుగంలో మొబైల్ యాప్‌లు, ఆన్‌లైన్ పాలసీలు, ఈ-క్లెయిమ్ సౌకర్యాలతో భీమా సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వచ్చాయి. పారదర్శకత పెరిగింది, సమయం ఆదా అవుతోంది. జాతీయ భీమా అవగాహన దినోత్సవం మనకు గుర్తు చేస్తుంది -- భీమా అనేది ఖర్చు కాదు, కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పించే తెలివైన పెట్టుబడి. నేడు తీసుకున్న సరైన పాలసీ రేపటి ఆర్థిక భద్రతకు మార్గం చూపుతుంది.

**వ్యాసకర్త**
**వేల్పుల మహేందర్**



# పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

**- కలెక్టర్ కె. హైమావతి**



**సిద్దిపేట, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జూన్ 28న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. 0--5 ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులను ఆమె కోరారు. జిల్లాలో 94,321 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 568 కేంద్రాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో 32 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేశారు. వలస కార్మికులు నివసించే ప్రాంతాల్లో ప్రత్యేక మొబైల్ బృందాలు తిరిగి సేవలు అందిస్తాయి. జూన్ 29, 30 తేదీల్లో కేంద్రాలకు రాని పిల్లలకు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే పోలియో చుక్కలు వేసినా మరోసారి వేయడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని శాఖల అధికారులు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఎల్.ఎం.డిని నీటితో నింపాలని గంగుల కమలాకర్ డిమాండ్



**కరీంనగర్ రూరల్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కరువు సమయంలో ప్రజలకు ఆదుకునేది కాలేశ్వరం ప్రాజెక్టే అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శనివారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్.ఎం.డి జలాశయంలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎల్.ఎం.డి నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్ స్థాయికి పడిపోయాయని, కరీంనగర్ ప్రజలకు త్రాగునీరు, రైతులకు సాగునీరు అందడం లేదని విమర్శించారు. మేడిగడ్డ వద్ద మరమ్మత్తులు చేయకపోవడం వల్ల ప్రతిరోజు వేల క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తోందని, ఆ నీటిని నిల్వ చేసి కన్నెపల్లి, సుందిళ్ల, అన్నారం, ఎల్లంపల్లి ద్వారా మిడ్ మానేరు, ఎల్.ఎం.డి లను నింపాలని సూచించారు. ప్రస్తుతం ఎల్.ఎం.డి లో ఐదున్నర టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయని, అందులో మూడు టీఎంసీలు డెడ్ స్టోరేజ్ కావడంతో త్రాగునీరు సరఫరా చేయడం సాధ్యం కాదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో ప్రజలకు రెండు మూడు రోజులకు ఒకసారి మాత్రమే నీరు అందిస్తున్నదని ఆరోపించారు. ప్రజలకు నీరు అందించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా హిందూ సామ్రాజ్య దివస్



**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో హిందూ సామ్రాజ్య దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్త ఎలగందుల సత్యనారాయణ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ స్థాపించిన హిందూ సామ్రాజ్యం భారతీయ సంస్కృతి, ధర్మం, స్వాభిమానానికి ప్రతీక అని అన్నారు. శివాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలు నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, సేవాభావం అలవర్చుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీర్ కోల అన్నారెడ్డి, ప్రధానాచార్యులు మోర రణధీర్, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, గట్టు శ్రీనివాస్, కొత్తూరి ముకుందం, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, నడిపెల్లి దీన్ దయాల్, అప్పిడి వకుల దేవి, విద్యార్థులు పాల్గొన్నారు. దేశభక్తి నినాదాలతో, స్ఫూర్తిదాయక సందేశాలతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## బాలలకు స్నేహపూర్వక న్యాయ సేవలపై అవగాహన సదస్సు



**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మంకమ్మతోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు, ప్యానెల్ న్యాయవాదులు బాలల హక్కులు, భద్రత, ఉచిత న్యాయ సేవలు, బాల్య వివాహాల నివారణ, యాసిడ్ దాడుల బాధితులకు చట్టపరమైన రక్షణ, పోక్సో చట్టం 2012 నిబంధనలపై వివరించారు. ప్రమాదంలో ఉన్న పిల్లలకు ఉచిత న్యాయ సహాయం, కౌన్సెలింగ్, రక్షణ, పునరావాసం అందించడంలో లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ చిల్డ్రన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సలహాలు, మధ్యవర్తిత్వం, లోక్ అదాలత్ సేవలు అందుబాటులో ఉన్నాయని, పిల్లలపై వేధింపులు లేదా హింస జరిగితే వెంటనే అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యం. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పారా లీగల్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్ సర్కిల్ కార్యాలయంలో సీపీ తనిఖీలు



**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తిమ్మాపూర్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు నిర్వహించిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, ప్రజల ఫిర్యాదుల పరిష్కారంపై సమగ్ర సమీక్ష చేశారు. కార్యాలయ ప్రాంగణ పరిశుభ్రతను పరిశీలించి మొక్కను నాటారు. తిమ్మాపూర్, ఎల్.ఎం.డి కాలనీ, చిగురుమామిడి స్టేషన్ల పనితీరుపై సమావేశం నిర్వహించి శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు సూచించారు.కొత్త సర్కిల్ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారని సీపీ అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ వ్యవస్థను అందించేందుకు అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్, ఎస్సైలు అన్వర్, నరేందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భారీ వర్షంతో ప్రజలలో ఊరట



**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీచి కుండపోత వర్షం పడింది.ప్రధాన రహదారులపై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, వర్షంతో వాతావరణం చల్లబడటంతో ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఊరట లభించింది.

## బాలసదన్ ను సందర్శించిన జడ్జి భవాని



**సుల్తానాబాద్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపెల్లి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, జడ్జి వంగర భవాని శనివారం పట్టణంలోని కొత్తగా నిర్మించిన బాలసదన్, వృద్ధాశ్రమం, మానసిక వికలాంగుల స్కూల్‌ను సందర్శించారు. వృద్ధాశ్రమంలో వృద్ధుల సమస్యలను అడిగి తెలుసుకుని సిబ్బందికి సూచనలు చేశారు. బాలసదన్‌లో స్టాక్ రిజిస్టర్, పిల్లలకు అందించే మెనూ పరిశీలించి సరైన ఆహారం, వసతులు కల్పించాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే న్యాయ సేవా సంస్థ లేదా సంక్షేమ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. మానసిక వికలాంగుల స్కూల్‌లో బోధన పద్ధతులను పరిశీలించి టీచర్ల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## శాతవాహన ఉపకులపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ అంతర్జాతీయ విద్యా పర్యటనకు ఎంపిక



**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉన్నత విద్యా ప్రమాణాల మెరుగుదల లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యా ప్రతినిధుల బృందం జూన్ 28 నుండి జూలై 6 వరకు జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాలలో అధ్యయన పర్యటన చేపట్టనుంది.రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ 2.0 ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఈ పర్యటన జరుగుతోంది. అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులు, పరిశోధనలు, వృత్తి విద్యా విధానాలను పరిశీలించి రాష్ట్ర ఉన్నత విద్యా వ్యవస్థలో వ్యూహాత్మక మార్పులు తీసుకురావడమే దీని ఉద్దేశ్యం.ఈ బృందంలో శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. సరసిజ ఉన్నారు. వీరు ఐరోపాలోని అగ్రగామి విద్యాసంస్థల ప్రతినిధులతో చర్చలు జరుపుతూ, వినూత్న విద్యా నమూనాలను అధ్యయనం చేయనున్నారు.పర్యటన అనంతరం తెలంగాణలోని విద్యా సంస్థల ప్రణాళికలు, మౌలిక సదుపాయాల ప్రమాణాలను మెరుగుపరచడంలో ఈ అధ్యయన పర్యటన కీలకంగా నిలవనుంది.

## పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి




**హుస్నాబాద్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: జూన్ 28న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి హుస్నాబాద్ మున్సిపల్ పరిధితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయని మండల వైద్యాధికారి డాక్టర్ మహిమునా తెలిపారు.పుట్టినప్పటి నుండి ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయడానికి ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, రూట్ సూపర్వైజర్లు సేవలందించనున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## పాఠశాలకు ఆటోను విరాళంగా ఇచ్చిన సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి



**ఖానాపూర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాత ఎల్లాపూర్ సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కొత్త ఆటోను కొనుగోలు చేసి అందజేశారు. దూర ప్రాంతాల నుండి విద్యార్థులు రాకపోవడం వల్ల బడిమానువేయడం లేదా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లడం జరుగుతుందని గమనించి, గతంలో టాటా మ్యాజిక్ ఇచ్చిన ఆయన ఈసారి ఆటోను కూడా డొనేట్ చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే లక్ష్యంతో సర్పంచ్ చేసిన ఈ సహకారం గ్రామస్తులు అభినందించారు. మండలంలోని ఇతర సర్పంచులు కూడా ఇలాంటి రవాణా సౌకర్యాలు కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.బడి బాట కార్యక్రమాలు, ఇంటింటి సర్వే ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్యను గుర్తించారని, ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని అధికారులు తెలిపారు.

## ఈ నెల 29న పట్టుబడ్డ ఇసుక డంపుల వేలంపాట

**ఖానాపూర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సోమార్పేట్, చింతల్ గ్రామపంచాయతీ పరిధిలో 25 ట్రాక్టర్ల ఇసుక డంపును అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు.తహసిల్దార్ సుజాత ప్రకటనలో తెలిపిన ప్రకారం, పట్టుబడ్డ ఇసుకను జూన్ 29న అదే స్థలంలో వేలం వేయనున్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5,000 ముందస్తు చెల్లించాలని, అధిక ధర చెప్పిన వారికి ఇసుక కేటాయిస్తారని తెలిపారు. వేలంలో ఇసుక దక్కని వారికి డిపాజిట్ తిరిగి ఇవ్వబడుతుందని పేర్కొన్నారు.

## ఘనంగా శివాజీ పట్టాభిషేక మహోత్సవం



**పెద్దపల్లి, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకుని హిందూ సామ్రాజ్య దినోత్సవ వేడుకలను ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో సిరి ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని శివంగారి సతీష్ కుమార్, జడల సురేందర్ ప్రారంభించి శివాజీ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా వక్తలు శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, దేశభక్తి, సమర్థ పరిపాలన నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవ, క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు, స్ఫూర్తిదాయక సందేశాలతో వేడుకలు విజయవంతంగా ముగిశాయి. అనంతరం పాల్గొన్న అతిథులు, యువకులను నిర్వాహకులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పెంజర్ల రాకేష్, ఉపసర్పంచ్ మేకల కుమార్ యాదవ్, శివంగారి రాజేష్ కుమార్, రాధాస్వామి, మహంత్ కృష్ణ, చంద్రశేఖర్, దయాకర్, హరీష్, మహేష్, శ్రవణ్, తిరుమల్, నరేందర్, భూత్కూరి రాజేష్, మనుక శ్రీనివాస్, రెవెల్లి సందీప్, పిట్ట వినయ్, మహేష్ వంశీ, రంజిత్, మహేందర్, లక్ష్మణ్, రాము, శివ, రాకేష్, సంతోష్, సాగర్, కౌశిక్, బంటీ, బబ్లు, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## క్యూబా పై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలని సీఐటీయూ నిరసన



**సుల్తానాబాద్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: సోషలిస్టు క్యూబా దేశంపై అమెరికా విధించిన ఆంక్షలను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ అమెరికా ఆంక్షల కారణంగా క్యూబా ప్రజలు ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అనేక కంపెనీలు మూతపడి లక్షలాది మంది ఉపాధి కోల్పోయారని తెలిపారు. వ్యవసాయ రంగం దెబ్బతిని, విద్యుత్ వినియోగం కూడా కష్టమైన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.అమెరికా సామ్రాజ్యవాదం క్యూబా ప్రజలను లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, వారు ధైర్యసాహసాలతో పోరాడుతున్నారని ముత్యంరావు అన్నారు. ఐక్యరాజ్యసమితి వెంటనే ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.కార్మిక వర్గం చైతన్యంతో అంతర్జాతీయ సంఘీభావ కార్యక్రమాల్లో పాల్గొని ప్రపంచ శాంతి కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ అధ్యక్షులు తాండ్ర అంజయ్య, ప్రధాన కార్యదర్శి నౌండ్ల బ్రహ్మచారి, ఇతర నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఆకుల రాజేందర్



**హుజురాబాద్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీజేపీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా ఆకుల రాజేందర్ నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు ధన్యవాదాలు తెలుపుతూ, పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. హుజురాబాద్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పుప్పాల రఘు, జిల్లా కార్యదర్శి నరసింహ రాజు, నిర్మల దేవి, మండల అధ్యక్షులు తూర్పాటి రాజు, పారుపల్లి కొండారెడ్డి, కొలకాని రాజు, రమేష్ యాదవ్, రాగం శ్రీనివాస్, బైరెడ్డి రమణారెడ్డి, బత్తిని నరేష్ గౌడ్, ఇతర నాయకులు పాల్గొని రాజేందర్‌ను ఘనంగా సన్మానించారు.

## జిల్లా వ్యాప్తంగా ఎస్.ఐ.ఆర్ అవగాహన సదస్సులు

**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియపై కరీంనగర్ జిల్లాలో పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు జరిగాయి.కరీంనగర్ నగర పాలక సంస్థ 50వ డివిజన్‌లో పోలింగ్ బూత్ నంబర్ 170 వద్ద కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు ప్రజలకు ఎస్.ఐ.ఆర్ అవసరాన్ని వివరించి, ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా సమస్యలు తలెత్తితే తనను సంప్రదించాలని సూచించారు.జిల్లా అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తల సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంటోనీ రెడ్డి మాట్లాడుతూ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని, లోపాలు లేని ఓటరు జాబితా పార్టీ విజయానికి కీలకమని పేర్కొన్నారు.చొప్పదండి మండలంలోని రుక్మాపూర్, కొలిమికుంట గ్రామాల్లో అడిషనల్ కలెక్టర్ అశ్విని తనాజీ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఫారాలు పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించి వారికి సూచనలు చేశారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ సమర్థవంతంగా ప్రక్రియను నిర్వహించాలని అధికారులకు సూచించారు.మొత్తంగా జిల్లా వ్యాప్తంగా ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం చురుకుగా కొనసాగుతోంది.

## ఇసుక డంపులపై అధికారుల నిర్లక్ష్యం

**ఖానాపూర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మండలంలోని పలు గ్రామాల్లో నదీప్రాంతాలు, వాగులు, వంకల్లో ఇసుక డంపులు పెరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రాజుల గ్రామంలో 40 ట్రాక్టర్ల ఇసుక డంపు పట్టుబడినప్పటికీ, స్వల్ప కాలంలోనే మళ్లీ ఇసుక డంపులు కనిపించడం అధికారుల పర్యవేక్షణ లోపాన్ని సూచిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి.నదులు, వాగుల నుండి ఇసుక తీయడం వలన వర్షాకాలంలో నేల కోతలు, నీటి నిల్వలు తగ్గిపోవడం, భూగర్భ జలాల శాతం పడిపోవడం వంటి ప్రమాదాలు తలెత్తుతాయని శాస్త్రవేత్తలు పలుమార్లు హెచ్చరించినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఇకనైనా రెవెన్యూ, అటవీ, భూగర్భ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుని నేల కోతలు, నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# జూలై 3లోపు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలి

**- కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఓటరు నమోదు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా జూలై 3వ తేదీలోపు ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.శనివారం పెద్దపల్లి పట్టణంలోని ప్రగతి నగర్‌లో కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి ఓటరికి రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయాలని, ఒకటి వివరాలతో నింపి స్వీకరించగా, మరొకటి రసీదుగా తిరిగి ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు బీఎల్‌వోలకు సహకరించి ఫారాల పంపిణీని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఇంటికి చేరుకొని పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తవక్లాపూర్‌లో ప్రజల సమస్యలపై వెంటనే స్పందించిన సర్పంచ్



**దేవరకొండ, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** డిండి మండలం తవక్లాపూర్ గ్రామంలో మూడు నెలల క్రితం ప్రారంభమైన రహదారి పనులు మధ్యలో నిలిచిపోవడంతో రోడ్డు మొత్తం గుంతలతో నిండిపోయింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఆ గుంతలు నీటితో నిండిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో దుర్వాసన వ్యాపించి, పరిసర ప్రాంత ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.ఈ సమస్యను గ్రామ ప్రజలు సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి గుంతలను మట్టితో పూడ్చే పనులు ఈరోజే ప్రారంభించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా గ్రామ అభివృద్ధి పట్ల తన కట్టుబాటును మరోసారి చాటుకున్నారు.గ్రామ ప్రజలు మాట్లాడుతూ, సమస్యలపై వెంటనే స్పందిస్తూ, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్యకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# ఆరుద్ర పురుగులు రైతులకు శుభసూచకాలు



**ఖానాపూర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తొలకరి వర్షాలు పడగానే నేలపై ఎర్రని బొట్లతో మెరిసే ఆరుద్ర పురుగులు కనిపించడం రైతులకు ఆనందం కలిగిస్తోంది. మృగశిర కార్తెలోనే కనిపించే ఈ పురుగులు వర్షాలు బాగుంటాయని సంకేతం ఇస్తాయని రైతులు నమ్ముతారు.పొలాల్లో సందడి చేసే ఈ పురుగులను దేవతల ప్రతిరూపంగా భావించి రైతులు చంపరు. ఆరుద్ర పురుగులు కనిపిస్తే ఆ సంవత్సరం చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండుతాయని రైతులు ధీమా వ్యక్తం చేస్తారు.ఎర్రగా, బొద్దుగా ఉండే ఈ పురుగులను పట్టు పురుగు, చందమామ పురుగు, లేడీ బర్డ్, ఇంద్రగోప పురుగు అని కూడా పిలుస్తారు. తొలకరి జల్లులు పడగానే కుప్పలుగా కనిపించే ఈ పురుగులు ప్రకృతి నేస్తాలుగా రైతుల కళ్లల్లో ఆనందం నింపుతున్నాయి.రసాయనాల అధిక వాడకం వల్ల వీటి ఉనికికి ప్రమాదం ఏర్పడుతోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ గ్రామాల్లో కనిపిస్తున్న ఆరుద్ర పురుగులు ఈసారి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనే ఆశను రైతుల్లో పెంచుతున్నాయి.

# బోగస్ ఓట్ల నిర్మూలనకు సమగ్ర సవరణ ప్రారంభం



**షాద్‌నగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత పారదర్శకంగా, పటిష్టంగా మార్చేందుకు బోగస్ ఓట్ల నిర్మూలన లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు.రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులుకు ఎన్యూమరేషన్ ఫారాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందజేశారు. అనంతరం గ్రామంలోని పలువురు ఓటర్లకు కూడా ఫారాలను పంపిణీ చేసి, ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో ప్రతి పౌరుడికి ఒకే చోట ఒకే ఓటు ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా ఓటరు జాబితాను ప్రక్షాళన చేసే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బీఎల్ఓలు, బీఎల్ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం అని, ప్రజలు తమ ఓటు ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారని, రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కుల్లో ఓటు హక్కు ఒకటని పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పారదర్శకంగా, సమర్థవంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, లింగారెడ్డిగూడ సర్పంచ్ ఎం.సి. ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ అశోక్, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, ఫరూక్‌నగర్ తహసీల్దార్ నాగయ్య, గ్రామ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ఎస్ సమక్షంలో గణేశ్ యువ సాంగ్



**ఖానాపూర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పట్టణంలోని అయ్యప్ప దేవాలయం ఆవరణలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గణేశ్ యువ సాంగ్ నిర్వహించారు. శనివారం సాయంత్రం సంకేత్వర్ధన్ స్వామి, రాజా, ముత్యం, ప్రభాకర్ గణేష్‌ల సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల నుండి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొన్నారు.దేశభక్తి పాటలతో ప్రారంభమైన కార్యక్రమంలో వక్తలు ప్రతి కార్యకర్త దేశ భద్రతకు అంకితమై ఉండాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పట్టణ చైర్మన్ అంకం మౌనిక మహేందర్, బీజేపీ నాయకులు, వ్యాపారులు, న్యాయవాదులు, గ్రామీణ ప్రాంతాల నుండి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరి



పోలియో మహమ్మారిని పూర్తిగా నిర్మూలించి ఆరోగ్యవంతమైన భావితరాలను తీర్చిదిద్దాలంటే 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని నీలగిరి ఎక్స్‌ప్రెస్ కరీంనగర్ 3వ పట్టణ రిపోర్టర్ కొంపెల్లి సాగర్ పిలుపునిచ్చారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో పల్స్ పోలియో కార్యక్రమం అత్యంత కీలకమైనదని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నో ఏళ్లుగా చేపడుతున్న పోలియో నిర్మూలన కార్యక్రమం విజయవంతం కావడంలో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఐదేళ్లలోపు వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా శాశ్వత వైకల్యానికి దారితీసే ఈ వ్యాధిని పూర్తిగా అరికట్టవచ్చని వివరించారు. ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీపంలోని పోలియో కేంద్రాలకు తీసుకెళ్లి చుక్కల మందు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.పిల్లల ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వ్యాసకర్త: కొంపెల్లి సాగర్



# క్రిశాంక్ పోరాటం ఆపలేరు

**- ఉప్పు రాజ్ కుమార్**



**పెద్దపల్లి, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ డాక్టర్ మన్నె క్రిశాంక్‌పై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపినా ఆయన పోరాటాన్ని ఆపలేవని బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్ అన్నారు.పెద్దపల్లి పట్టణంలోని స్ఫూర్తి దివ్యాంగుల కేంద్రంలో క్రిశాంక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులతో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో క్రిశాంక్ కీలక పాత్ర పోషించారని, తరువాత టీఎస్ఎండిసి చైర్మన్‌గా సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చారని పేర్కొన్నారు. ఉన్నత విద్యలోనూ రాణించి పీహెచ్‌డీ సాధించడం గర్వకారణమని అన్నారు.ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న క్రిశాంక్ లక్షలాది బిఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌కు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని రాజ్ కుమార్ అన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో లవన్ కుమార్, పల్లె మధు, ప్రేమ్ కుమార్, పెంచాల శ్రీకాంత్, పూదరి అనిల్ కుమార్, బైరం నటరాజ్, కుక్క మనోజ్, నారగోని శివ, మహేష్ కుమార్, మనోజ్ కుమార్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# 45.62 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**ఖానాపూర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఖానాపూర్, కడెం మండలాల్లో 45.62 కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పార్లమెంట్ సభ్యుడు జి. నగేష్ శనివారం రాత్రి శంకుస్థాపన చేశారు.ఖానాపూర్ పట్టణంలోని బుడ్డోని కుంట అభివృద్ధికి ?1.21 కోట్లు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి ?43 కోట్లు, కడెం మండలంలో ఎఫ్‌సి కేంద్రం పనులకు ?14 కోట్లు, నచ్చనిల్లాపూర్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వ నిధులను అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నామని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వేడుమ బొజ్జు పటేల్, కలెక్టర్ భవిష్ మిశ్రా, జాయింట్ కలెక్టర్, డీఎస్పీ, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్, వైస్ చైర్మన్ సోయబ్ హుస్సేన్, కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు కల్వకుర్తిలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పర్యటన



**కల్వకుర్తి, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆదివారం కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో పర్యటించనున్నారు.వెల్దండ మండలం చౌదర్పల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థులు, తల్లిదండ్రులు, యువతతో ముఖాముఖి సంభాషణ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యా, ఉపాధి, యువత భవిష్యత్తు అంశాలపై చర్చ జరగనుంది.అదేవిధంగా కల్వకుర్తి పట్టణంలో మాజీ శాసనసభ్యులు, స్వర్గీయ గుడియంపల్లి ద్యాప గోపాల్ రెడ్డి 100వ శతజయంతి ఉత్సవాల కార్యక్రమానికి కూడా ఆయన హాజరుకానున్నారు.ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శనివారం మీడియాకు మాట్లాడుతూ, “ఈ రెండు కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం కావాలి” అని తెలిపారు.

## పల్స్ పోలియో అవగాహన ర్యాలీ



**వంగూరు, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూరు మండల కేంద్రంలో శనివారం పల్స్ పోలియోపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, గ్రామ ప్రజలకు పోలియో చుక్కల ప్రాముఖ్యతను వివరించారు.ఆదివారం, జూన్ 28న పోలియో కార్యక్రమం జరగనుందని, ఐదు సంవత్సరాల లోపు చిన్నపిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించుకోవాలని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వంగూరు గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్లు, ఆశా వర్కర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ప్రజల్లో చైతన్యం కల్పించారు.

## ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో కీలక సూచనలు చేసిన ఎమ్మెల్యే



**మిర్యాలగూడ, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వేములపల్లి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , ఎస్ఐఆర్ కార్యక్రమం ఇంచార్జ్ షాబీర్ అలీతో కలిసి సర్పంచులు, మండల ఇంచార్జులు, బూత్ లెవల్ ఏజెంట్లు లకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం చేపట్టిన సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి బీఎల్ఏ కీలక పాత్ర పోషించాలన్నారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి ఇంటిని సందర్శించి, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇంచార్జ్ షాబీర్ అలీ కార్యక్రమం అమలు విధానం, దరఖాస్తుల స్వీకరణ, అవసరమైన పత్రాలు, క్షేత్రస్థాయిలో పాటించాల్సిన విధివిధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల ఇంచార్జులు, సర్పంచులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ




**దేవరకొండ జూన్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమంలో భాగంగా నేరేడుగొమ్మ మండలం, తిమ్మాపురం గ్రామం (పోలింగ్ కేంద్రం నెం. 202)లో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సూచనల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు వాంకునావత్ బిక్కు నాయక్, నేరేడుగొమ్ము క్లస్టర్ కోఆర్డినేటర్ గిరి యాదయ్య , కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఎ పంబాల పర్వతాలు ఆధ్వర్యంలో ఓటర్లకు ఎమ్యునరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ సంబంధిత సిబ్బంది ఓటర్లకు ఎమ్యునరేషన్ ఫారాలను అందజేస్తున్నారు.గ్రామంలోని ప్రతి ఓటరు తప్పనిసరిగా ఈ ఫారాలను స్వీకరించి, పూర్తి వివరాలతో నింపి నిర్ణీత గడువులోగా బీఎల్ఓలకు సమర్పించాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు సక్రమంగా నమోదు కావడం, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, చిరునామా మార్పులు వంటి అంశాలకు ఈ ప్రక్రియ ఎంతో కీలకమని తెలిపారు.అందువల్ల తిమ్మాపురం గ్రామ ప్రజలందరూ ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పుల సురేందర్ రెడ్డి, గడ్డం వెంకటయ్య, కుంభం రామకృష్ణ, కుంభం నిరంజన్, బొడ వెంకటయ్య, బయ్య తిరుపతయ్య, రావులపల్లి వెంకటయ్య, జిల్లెల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను సద్వినియోగం చేసుకోండి

**- ఎలిగేడు ఉపసర్పంచ్ పిలుపు**




ఎలిగేడు ఉపసర్పంచ్ ముంజం నరేష్

**ఎలిగేడు, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలో ఆదివారం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఎలిగేడు గ్రామ ఉపసర్పంచ్ ముంజం నరేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించుకోవాలని ఆయన సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామపంచాయతీ కార్యాలయం, హెల్త్ సబ్‌సెంటర్లలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పోలియో చుక్కలు వేయించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.పోలియో రహిత భారత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పిల్లల ఆరోగ్య రక్షణలో నిర్లక్ష్యం చేయరాదని ఉపసర్పంచ్ నరేష్ స్పష్టం చేశారు.

## ఢిల్లీలో జాతీయ గౌరవ్ సమ్మన్ అవార్డు అందుకున్న కొండ రవియాదవ్




ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న కొండ రవి యాదవ్

**ఎలిగేడు, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేశవ్యాప్తంగా యువతలో మత్తు పదార్థాల వాడకాన్ని అరికట్టేందుకు, చెడు మార్గాల్లోకి వెళ్లకుండా చైతన్యం కల్పించేందుకు ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో జూన్ 26న జరిగిన జాతీయ స్థాయి సమావేశంలో తెలంగాణ రాష్ట్ర తొలి జాతీయ యువజన అవార్డు గ్రహీత కొండ రవియాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు జాతీయ గౌరవ్ సమ్మన్ అవార్డు మరియు సర్టిఫికేట్ అందజేయబడింది.గత 15 ఏళ్లుగా సామాజిక గేయాలు పాడుతూ ప్రజల్లో చైతన్యం కల్పించడం, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా సమాజానికి చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్, జాతీయ యువజన అవార్డు గ్రహీతల సంఘం బాధ్యులు జావేద్ జమీధర్, మనీష్, మహారాణి, సురేష్ శర్మ, నిధి ప్రజాపతి, సుధారాణి, మిస్ ఇండియా కాంటెస్ట్ సభ్యులు, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన 500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.కొండ రవియాదవ్ గౌరవం అందుకోవడం పట్ల ఎలిగేడు మండల ప్రజలు, ధూళికట్ట గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

## వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడికి ఘన సన్మానం



**నాగర్‌కర్నూలు, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా మిడిదొడ్డి అంజయ్య ఎన్నిక కావడంతో ఆయనకు ఘన సన్మానం జరిగింది.ఈ సందర్భంగా వాసవి యువసేన ఆధ్వర్యంలో, అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్ కుమార్ నేతృత్వంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మిడిదొడ్డి అంజయ్య హామీ ఇచ్చారు. ఆలయ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.సన్మాన కార్యక్రమంలో డివి నారాయణ, పాండు, హకీమ్ కిషోర్, పరమేశ్వరు, భరత్, శ్యాంసుందర్, రమేష్, ప్రసాద్, భాను, కిరణ్, లీలాధర్, కిషోర్, పవన్, భాస్కర్, సంతోష్, శివకుమార్తో పాటు వాసవి యువసేన, వాసవి జర్నలిస్టు సభ్యులు పాల్గొన్నారు.

# ఎలిగేడు వాటర్ ట్యాంక్ కూల్చివేత





8 నీలగిరి ఎక్స్‌ప్రెస్

శిథిలావస్థకు చేరుకున్న వాటర్ ట్యాంక్

**- ప్రజల హర్షం**

**ఎలిగేడు, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండల కేంద్రంలోని ఉన్ని ప్రాంగణంలో దశాబ్దాల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుందని జూన్ 11న నీలగిరి ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆ కథనానికి స్పందనగా గ్రామ పాలకవర్గం, అధికార యంత్రాంగం వెంటనే చర్యలు తీసుకుని శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను కూలగొట్టి తొలగించారు.గతంలో ఆ ప్రాంతంలో నీరు నిల్వ ఉండి పిచ్చి మొక్కలు పెరిగి దుర్వాసన వ్యాపించేది. యువకులు ఆటలాడుకునే ప్రాంగణం అసౌకర్యానికి గురయ్యేది. ఇప్పుడు ట్యాంక్ తొలగింపుతో ఆ ప్రాంతం పరిశుభ్రంగా మారి, ప్రజలు సౌకర్యంగా సంచరించే స్థితి ఏర్పడింది.ఈ చర్యపై చుట్టుపక్కల నివాసులు, యువకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యను వెలుగులోకి తీసుకువచ్చినందుకు నీలగిరి ఎక్స్‌ప్రెస్కు గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బీఎల్ఎలు కాంగ్రెస్ పార్టీకి పునాది

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**





**ఆమనగల్లు, జూన్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ)కాంగ్రెస్ పార్టీకి పునాది అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన కల్వకుర్తి నియోజకవర్గం బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ ఇంచార్జ్ సిద్ధేశ్వర్, నియోజవర్గ ఇన్చార్జ్ సంధ్యారెడ్డి, బిఎల్ఎ ట్రైనర్ గోని సతీష్, పీబీసీ సభ్యుడు ఠాకూర్ బాలాజీ సింగ్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొదటి నుంచి పార్టీనే నమ్ముకుని, పటిష్టత కోసం పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలకే కాంగ్రెస్ పార్టీలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. బీఎల్ఎలు ఓటర్ల నమోదు సమయంలో అజాగ్రత్తగా ఉండకుండా ప్రతి ఒక్క ఓటును నమోదు చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు లభించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో పీసీసీ సభ్యులు మధుసూదన్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, విజయ్ కుమార్, రమాదేవి, డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, అంజయ్య గుప్తా, ఆయా మండలాల అధ్యక్షులు భట్టు కిషన్ రెడ్డి, తెల్గమల్ల జగన్, బిచ్యా నాయక్, బాల్ రెడ్డి, హరికిషన్, పట్టణ అధ్యక్షులు మానయ్య, రాహుల్, మాజీ జడ్పీటీసి శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శంకర్ నాయక్, భూపతి రెడ్డి, కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, గుర్రం కేశవులు, కృష్ణ నాయక్, అవ్వారి శివలింగం, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎంగలి ప్రసాద్, అబ్దుల్ అలీమ్, శ్రీకాంత్, ఫరీద్, నాజర్, బాబా, అంజన్ రెడ్డి, కరీం, దేవరశెట్టి మహేష్, శ్రీధర్ నాయక్, విజయ్ రాథోడ్, కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అచ్చంపేట మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహప్రవేశ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. ఇందిరమ్మ ఇల్లు వంటి ప్రతిష్టాత్మక పథకాలు పేదలకు శాశ్వత గృహాన్ని అందించడమే కాకుండా, అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నాయి" అని పేర్కొన్నారు.గ్రామ సర్పంచ్ శిరీష జాను నాయక్, మండల పార్టీ అధ్యక్షులు బుచ్చి రాముడు, రాష్ట్ర నాయకులు కుంద మల్లికార్జున్, శత్రు నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతల రాజగోపాల్, కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా గోవర్ధన్



**కల్వకుర్తి, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా కల్వకుర్తి మాజీ ఎంపీపీ కొండూరు గోవర్ధన్ నియామకమయ్యారు.హైదరాబాద్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య మహాసభ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ శనివారం గోవర్ధన్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా విద్యా కమిటీ చైర్మన్ మాచిపెద్ది శివకుమార్, రాష్ట్ర నాయకులు చంద్రకుమార్, బలుస శ్రీరాములు, మేడిశెట్టి సురేష్, ఉప్పు ఆంజనేయులు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.కొండూరు గోవర్ధన్ నియామకంపై కల్వకుర్తి ప్రాంతీయ నాయకులు, ఆర్యవైశ్య సమాజం సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, జూన్ 27 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో శనివారం మండలానికి సంబంధించిన 28మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు కల్యాణలక్ష్మి పథకం కొంత ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్నదని చెప్పడంలో ఎలాంటి సందేహమూ లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లకాలంలో రైతు, మహిళా సంక్షేమంపై దృష్టి పెట్టి కొత్తగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్, ఇతర ప్రభుత్వ పథకాల విషయంలో ఎవరూ ఒక్క రూపాయి వేరే వారికి ఇవ్వాల్సిన అవసరం లేదని సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నిజాయితీగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఇంచార్జ్ సిద్ధేశ్వర్, పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, తహసిల్దార్ ఫహీం ఖాద్రి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మహిళా అధ్యక్షురాలు రమాదేవి, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, విజయ, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ జడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, మాజీ ఎంపీటీసీ నిట్ట నారాయణ, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బాబా, ఫరీద్, ఎంగలి ప్రసాద్, అయోధ్య, శ్రీను నాయక్, పర్వతాలు తదితరులు ఉన్నారు.

# గత్తర మూవీ ఘన విజయం సాధించాలి

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**
**- గత్తర మూవీ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే**




**ఆమనగల్లు, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన కమ్లికార్ రజినీకాంత్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'గత్తర' సినిమా పోస్టర్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 'గత్తర' సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుని ఘన విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. ఈ చిత్రం దర్శకుడు, నిర్మాతలు, నటీనటులకు మంచి గుర్తింపు తీసుకురావాలని అభిలషించారు. దర్శకుడు కమ్లికార్ రజినీకాంత్ మాట్లాడుతూ, ఈ సినిమాలో హీరోగా రాకేష్ నటిస్తుండగా, నిర్మాతలుగా జ్యోతి రెడ్డి, శంకర్ రెడ్డి వ్యవహరిస్తున్నారని తెలిపారు. రచయితగా సతీష్ పనిచేస్తున్న ఈ చిత్రంలో సీనియర్ నటులు బాబు మోహన్, తనికెళ్ల భరణి, బలగం సుధాకర్ రెడ్డి, జబర్దస్త్ రాజమౌళి, యాదమ్మ రాజు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారని చెప్పారు. సమాజానికి మంచి సందేశాన్ని అందించే మెసేజ్ ఓరియెంటెడ్ చిత్రంగా లి'గత్తర'లిను రూపొందిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో క్యామ రాజేష్, షాబుద్దీన్, గంజి చంద్రశేఖర్, సుభాష్, శివకృష్ణ, రమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 4న చెస్ పోటీలను విజయవంతం చేయాలి..

**- అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు చిన్న జంగయ్య**
**- డాక్టర్ శివను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన సంఘం నాయకులు**



**ఆమనగల్లు, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జూలై 4, 2026న నిర్వహించనున్న చెస్ పోటీలను విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షుడు లండం చిన్న జంగయ్య అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని న్యూ లైఫ్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ శివ (ఎంబీబీఎస్)ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం చెస్ పోటీల నిర్వహణ, యువతలో మేధో వికాసానికి చెస్ క్రీడ దోహదపడే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివ మాట్లాడుతూ.. యువత మేధోపరమైన క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమని, ఇటువంటి కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. జూలై 4న నిర్వహించే చెస్ పోటీల్లో విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లండం చిన్న జంగయ్య కోరారు. కార్యక్రమంలో గుమ్మకొండ రాజు, రమేష్, మల్లేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో జూలై 2న కాంగ్రెస్ భారీ బహిరంగ సభ


**- కరపత్రాలను విడుదల చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జూలై 2న కల్వకుర్తిలో నిర్వహించనున్న "ఇందిరమ్మ ప్రజాపాలన--ప్రగతి నివేదిక" బహిరంగ సభను విజయవంతం చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో సభకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలో అమలు చేసిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఈ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణను సభలో ప్రజలకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. సభకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు హాజరుకానున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనకు ప్రజల మద్దతును చాటిచెప్పే విధంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఇంచార్జ్ సిద్ధేశ్వర్, పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, పిబిసి సభ్యుడు బాలాజీ సింగ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, విజయ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు రమాదేవి, గుర్రం కేశవులు, మండల అధ్యక్షులు భట్టు కిషన్ రెడ్డి, తెల్గమల్ల జగన్, విజయ, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ జడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, మాజీ ఎంపీటీసీ నిట్ట నారాయణ, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బాబా, ఫరీద్, ఎంగలి ప్రసాద్, అయోధ్య, శ్రీను నాయక్, పర్వతాలు తదితరులు ఉన్నారు.

# జూలై 1న లయన్స్ క్లబ్, లియో క్లబ్ నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారం







**- ఆమనగల్లులో ఘనంగా నిర్వహణ..**
**- సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపు**

**ఆమనగల్లు, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు 41వ నూతన కార్యవర్గంతో పాటు 17వ లియో క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని జూలై 1వ తేదీ సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని కళ్యాణి గార్డెన్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు క్లబ్ పీఆర్ఓ ఎం.ఎ. పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లయన్స్ క్లబ్ 41వ అధ్యక్షునిగా ఎంగలి బాలకృష్ణ, కార్యదర్శిగా జి. శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా గంప శ్రీనివాసులు, పీఆర్ఓగా ఎం.ఎ. పాషాతో పాటు నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అలాగే 17వ లియో క్లబ్ అధ్యక్షునిగా లియో జే. శ్యాంసుందర్, కార్యదర్శిగా శశిధర్, కోశాధికారిగా ధర్మేందర్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ జి. మహేందర్ కుమార్ రెడ్డి, పాస్ట్ మల్టిపుల్ చైర్మన్ ఎస్. నరేందర్ రెడ్డి, మాజీ జిల్లా గవర్నర్ లయన్ జి. చెన్న కిషన్ రెడ్డి, జూలూరు రమేష్ బాబు, రీజియన్ చైర్‌పర్సన్ లయన్ డాక్టర్ ప్రశాంత్ రెడ్డి, జోన్ చైర్మన్ బి.ఆర్. రెడ్డి, మాస్టర్ ఆఫ్ సెర్మనీ డాక్టర్ వి. దామోదర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. లయన్స్ క్లబ్, లియో క్లబ్ సభ్యులు, సేవాభావం కలిగిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని క్లబ్ పీఆర్ఓ ఎం.ఎ. పాషా కోరారు.


# ఘనంగా బంకించంద్ర చటర్జీ జయంతి




**మహబూబాబాద్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర చటర్జీ 188వ జయంతి వేడుకలు పట్టణంలోని శ్రీరాం నగర్ బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా జరిగాయి. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, "దేశభక్తి నినాదంగా నిలిచిన వందేమాతరం గీతాన్ని అందించిన మహనీయుడు బంకించంద్ర చటర్జీ. ఆయన రచనలు స్వాతంత్ర్య ఉద్యమానికి విశేష స్ఫూర్తినిచ్చాయి" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరి, అర్చనతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో పల్స్ పోలియోకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**- డిఎండహెచ్ఓ డా. స్వర్ణ కుమారి**



**రంగారెడ్డి, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో నేడు నిర్వహించనున్న పల్స్ పోలియో రోగనిరోధక కార్యక్రమం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణ కుమారి వెల్లడించారు. జిల్లా కార్యాచరణ ప్రణాళిక ప్రకారం మొత్తం 16,88 పోలియో బూత్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. పట్టణ ప్రాంతంలో 493, గ్రామీణ ప్రాంతంలో 1,195 బూత్‌ల ద్వారా ఐదు సంవత్సరాల లోపు 4,20,911 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. కార్యక్రమం పర్యవేక్షణ కోసం 167 రూట్ సూపర్వైజర్ వాహనాలు, 50 మొబైల్ బృందాలు, 53 ట్రాన్సిట్ పాయింట్లు, 55 ప్రచార వాహనాలు, 12 జిల్లా స్థాయి అధికారులు, 43 కోల్డ్ చైన్ కేంద్రాలు, 2,010 వ్యాక్సిన్ క్యారియర్లు, అవసరమైన ఐస్ ప్యాక్‌లు సిద్ధంగా ఉంచారు. జిల్లాలో గుర్తించిన 481 హైరిస్క్ ప్రాంతాల్లో నివసిస్తున్న 6,213 మంది చిన్నారులకు ప్రత్యేక బృందాల ద్వారా పోలియో చుక్కలు వేయనున్నారు. ఈ కార్యక్రమంలో 6 మంది ప్రోగ్రామ్ అధికారులు, 5 మంది డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, 54 మంది వైద్యాధికారులు, 61 మంది స్టాఫ్ నర్సులు, 153 మంది సూపర్వైజర్లు, 474 మంది హెల్త్ అసిస్టెంట్లు, 1,317 మంది ఆశా కార్యకర్తలు, 1,600 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 604 మంది నర్సింగ్ విద్యార్థులు పాల్గొననున్నారు. డా. స్వర్ణ కుమారి మాట్లాడుతూ, "జూన్ 28న ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా సమీపంలోని పోలియో బూత్‌లో పోలియో చుక్కలు వేయించాలి. ఇప్పటికే సాధారణ టీకాలు పొందిన పిల్లలకు కూడా ఈ చుక్కలు తప్పనిసరిగా వేయాలి" అని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా చిరుతల రామాయణం మహోత్సవం



**పెద్దపల్లి, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఓదెల మండలం కనగర్తి గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి చిరుతల రామాయణం పట్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్ల మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుతల రామాయణం వంటి జానపద కళారూపాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప వేదికలని పేర్కొన్నారు. యువత ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సంప్రదాయాలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ చొప్పరి సంధ్యా రాణి, మచ్చ నర్సింగా రావు, మారగిరి క్రిష్టయ్య, రావుల రాజయ్య, జాగిరి అంజి గౌడ్, అంబాల అంజయ్య, చాల్లవెల్లి శ్రీనివాస్, బదెల మల్లికార్జున, చెరకుతోట సతీష్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామనాయకులు, భక్తులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధిపై దౌర్జన్యం - కేసు నమోదు



**పెద్దపల్లి, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దకల్వల గ్రామ పంచాయతీ సమావేశంలో అభివృద్ధి పనులను ప్రశ్నించిన వార్డ్ సభ్యుడు బోలం వినయ్‌పై సర్పంచ్ భర్త నర్ల పోల్ రాజ్, కుమారుడు నర్ల సాయి దౌర్జన్యానికి దిగారని ఆయన ఆరోపించారు.వినయ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, భోజన్న చెరువుతో పాటు గ్రామాభివృద్ధి సమస్యలను చర్చకు పెట్టిన సమయంలో సర్పంచ్ కుటుంబ సభ్యులు సమావేశంలోకి దూరి తనను అడ్డుకోవడమే కాకుండా అధికారులను కూడా అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. రాష్ట్ర మహిళా మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యేపై కూడా అవమానకర వ్యాఖ్యలు చేశారని ఆయన పేర్కొన్నారు.ఈ ఘటనపై వినయ్ పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు నర్ల పోల్ రాజ్, నర్ల సాయిలపై కేసులు నమోదు చేశారు. ప్రజాప్రతినిధులపై దాడులు ప్రజాస్వామ్యానికి ముప్పు అని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినయ్ డిమాండ్ చేశారు.

# ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్ - 115 వాహనాలు సీజ్





**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు అమర్చిన వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. శనివారం వన్‌టౌన్ కార్నర్ వద్ద జరిగిన డ్రైవ్‌లో 115 వాహనాలను సీజ్ చేసినట్లు ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి తెలిపారు. తప్పు నంబర్ ప్లేట్లు, స్టిక్కర్లు, డిజైన్లతో నంబర్లు కనిపించకుండా చేసిన వాహనాలు, నంబర్ ప్లేట్ లేకుండా నడిపిన వాహనాలపై చర్యలు తీసుకున్నారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించి, వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.ప్రతి వాహనానికి ప్రభుత్వం నిర్దేశించిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని ఏసీపీ హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# కలుషిత నీటి సమస్యపై సిపిఎం ఆందోళన



**నందికొట్కూరు, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీల కారణంగా త్రాగునీటిలో కలుషిత నీరు చేరి ప్రజల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని సిపిఎం మండల కన్వీనర్ ఎం.కర్ణ ఆందోళన వ్యక్తం చేశారు.జూపాడు బంగ్లా మండలంలోని తంగడంచ గ్రామంలో ప్రజల సమస్యలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామ సెక్రటరీలు నిర్లక్ష్యం వహించడం వల్ల కలుషిత నీరు వస్తోందని, వెంటనే పైప్‌లైన్ మరమ్మతులు చేసి, పబ్లిక్ కులాయిలను బాగు చేయాలని డిమాండ్ చేశారు.ప్రతి 15 రోజులకు ఒకసారి నీటి ట్యాంకులో బ్లీచింగ్ పౌడర్ వేసి శుభ్రపరచాలని, లేకపోతే గ్రామ ప్రజలను సమీకరించి సచివాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీతారామిరెడ్డి, కృష్ణ, గోపాల్ రావు, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించిన దేవదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి





**శ్రీశైలం, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్రంలోని దేవాలయాలను దర్శించుకునే భక్తులకు మెరుగైన సేవలు, సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివార్లను దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ రాజగోపురం వద్ద ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.దర్శనానంతరం వేదాశీర్వచనం, శేషవస్త్రం, తీర్థప్రసాదాలు, స్వామి-అమ్మవారి చిత్రపటాన్ని మంత్రికి అందజేశారు. భక్తుల విశ్వాసానికి తగిన సేవలు అందించడం, ఆలయాల అభివృద్ధిని వేగవంతం చేయడం, ప్రతి యాత్రికుడికి సంతృప్తికరమైన దర్శనానుభూతి కల్పించడం ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో అదనపు కమిషనర్ ఎస్.ఎస్. చంద్రశేఖర ఆజాద్, ఈఓ శ్రీనివాసరావు, ఇంజనీర్ అధికారులు పాల్గొన్నారు.

# మానేరు డ్యాంపై సుడా ఛైర్మన్ సవాల్



**కరీంనగర్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మానేరు డ్యాంలో నీటిమట్టం విషయంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన వ్యాఖ్యలపై సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు.శనివారం డ్యాంను సందర్శించిన ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ హాయంలో 15 టీఎంసీల కంటే నీటిమట్టం ఎన్నడూ తగ్గలేదన్నావు గదా, ఇదిగో అధికారిక రికార్డులు 7 టీఎంసీల స్టోరేజ్ చూపిస్తున్నాయి. దమ్ముంటే నా సవాల్ స్వీకరించు" అని గంగుల కమలాకర్‌ను సవాలు విసిరారు. ప్రస్తుతం డ్యాంలో 5.8 టీఎంసీలు మాత్రమే నీరు ఉందని, అందులో 2 టీఎంసీలు డెడ్ స్టోరేజ్ కావడంతో త్రాగునీటికి సరిపోతుందని, మిడ్ మానేరు డ్యాంలో అదనంగా 4 టీఎంసీలు ఉన్నాయని నరేందర్ రెడ్డి తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మత్తులు చేయకపోవడం వల్ల నీటి సమస్యలు తలెత్తాయని, ప్రజలను తప్పుదోవ పట్టించే డ్రామాలు, అబద్ధాలు ఆపకపోతే ప్రజలే గంగులపై ప్రజాక్షేత్రంలో తీర్పు ఇస్తారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ కర్ర రాజశేఖర్, కార్పొరేటర్ పర్వతాల మల్లేశం, గోపు మల్లారెడ్డి, చర్ల పద్మ, నెల్లి నరేష్, షబానా మహమ్మద్, ముల్కల కవిత, జ్యోతి రెడ్డి, అస్థాపురం తిరుమల, మహాలక్ష్మి, కంది అశోక్ రెడ్డి, బషీర్, షెహన్షా, మాసుం ఖాన్, రాజ్ కుమార్, హనీఫ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి స్కూల్‌లో పుస్తకాల అక్రమ విక్రయం సీజ్





**అమ్రాబాద్, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అచ్చంపేట పట్టణంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు గుర్తించారు. సమాచారం అందుకున్న మండల విద్యాధికారి సంఘటనా స్థలానికి చేరుకొని పుస్తకాలను సీజ్ చేశారు.ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాంలు అమ్మకూడదనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ, యాజమాన్యం పాఠశాల ఆవరణలోనే తల్లిదండ్రులకు పుస్తకాలు విక్రయిస్తున్నట్లు బయటపడింది. విద్యార్థి సంఘాల నాయకులు సయ్యద్, డ్యాగ అనిల్ కుమార్, బుక్కాపురం మహేష్ మాదిగ, ఉదయ్, ఆంజనేయులు తదితరులు పాఠశాలలో పరిశీలించి ఎంఈఓకి ఫిర్యాదు చేశారు.ఎంఈఓ స్పందించి పుస్తకాలను సీజ్ చేసి, యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. యాజమాన్యం విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తోందని ఆరోపణలు ఉన్నాయి.విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, ప్రైవేట్ స్కూళ్లు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను దోచుకుంటున్నాయి. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే పుస్తకాలను కూడా అమ్ముతూ విద్యార్థుల హక్కులను కాలరాస్తున్నాయి. ఇలాంటి అక్రమాలపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం అని హెచ్చరించారు.జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# స్టాప్ - వాష్ అండ్ గో కార్యక్రమంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



**నంద్యాల, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రత కోసం నంద్యాల జిల్లా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రధాన రహదారులపై ప్రతిరోజూ స్టాప్ - వాష్ అండ్ గో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ బస్సులను ఆపి డ్రైవర్ల లైసెన్సులు, వాహన ధ్రువపత్రాలు పరిశీలిస్తున్నారు. కడప--నంద్యాల, కర్నూలు--విజయవాడ, కర్నూలు--బెంగళూరు హైవేలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.వాహనాలను అతి వేగంతో నడపకుండా, రాంగ్ రూట్‌లో వెళ్లకుండా, పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించకుండా డ్రైవర్లకు సూచనలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పోలీసులు ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ, భద్రతా చర్యలు పాటించాలని గుర్తు చేశారు.

# యూరియా, డీఏపీతో లింక్ పొడక్టులు విక్రయించరాదు

**-- సూరజ్ ధనుంజయ్**



**నంద్యాల, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మాట్లాడుతూ, ఎరువుల కంపెనీలు యూరియా, డీఏపీ ఎరువులతో లింక్ ప్రొడక్టులు జతచేసి విక్రయించరాదని స్పష్టం చేశారు.రేక్ పాయింట్ నుంచి డీలర్లకు సరఫరా చేసే సమయంలో తప్పనిసరిగా జీపీఎస్ ట్రాకింగ్ అమలు చేయాలని సూచించారు. అలాగే డీలర్లు గరిష్ట చిల్లర ధర ఎంఆర్పీకు మాత్రమే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు.రైతులకు అవసరమైన మేరకు పారదర్శకంగా, సమర్థవంతంగా ఎరువుల సరఫరా జరగాలని ఆయన సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ, డీలర్లు అవసరమైన ప్రాంతాలకు మాత్రమే సరఫరా చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో ఫర్టిలైజర్ కంపెనీల సేల్స్ అధికారులు, హ్యాండ్లింగ్ ఆపరేటర్లు, మార్క్ఫెడ్ అధికారి హరినాథ్ రెడ్డి, సాంకేతిక వ్యవసాయ అధికారి కళ్యాణ్ కుమార్, ఏఈఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

# సరిహద్దులోని నియంత్రణ రేఖ సమీపంలో పేలుడు..

**-ఒకరు మృతి, నలుగురికి గాయాలు**



**న్యూఢిల్లీ: జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
దేశ సరిహద్దులోని నియంత్రణ రేఖ సమీపంలో పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఒక వ్యక్తి మరణించాడు. మరో నలుగురు గాయపడ్డారు. ఈ పేలుడుకు కారణం ఏమిటన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం గుల్‌మార్గ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్వోసీ) సమీపంలో 'ఆశా పోస్ట్' వద్ద పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఒక వ్యక్తి మరణించాడు. మరో నలుగురు గాయపడ్డారు.కాగా, మృతుడిని బారాముల్లా జిల్లాలోని చందూసా ప్రాంతానికి చెందిన జాబిర్ అహ్మద్ బజాద్‌గా గుర్తించారు. గాయపడిన నలుగురిని వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పేలుడుకు కారణాలు ఏమిటన్నది తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు పాత బాంబు షెల్‌ను తాకడం లేదా కదిలించడం వల్ల ఈ పేలుడు సంభవించినట్లు అనుమానిస్తున్నారు. ఆ పేలుడు పదార్థారం ఏమిటన్నది దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉన్నది.

# 194 ఏళ్ల తాబేలును కలుసుకోనున్న ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ: జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హిందూ మహాసముద్ర ద్వీపం సీషెల్స్‌లో వచ్చే వారం ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఆ పర్యటన వేళ ఆయన అక్కడ నేషనల్ బోటానికల్ గార్డెన్స్ వెళ్లనున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన అక్కడ ఓ వృక్షాన్ని నాటనున్నారు. భారత్, సీషెల్స్ మధ్య 50 ఏళ్ల దౌత్య బంధానికి ప్రతీకగా ప్రధాని మోదీ ఈ పర్యటన చేపట్టనున్నారు. సీషెల్స్ జాతీయ దినోత్సవ సంబరాల్లో మోదీ గౌరవ అతిథిగా పాల్గొంటారు. ఇక ప్రపంచంలో ప్రాణాలతో ఉన్న అతి వృద్ధ జంతువును కూడా ప్రధాని మోదీ కలుసుకోనున్నారు1832లో పుట్టిన తాబేలును ఆయన వీక్షించనున్నారు. ఆ తాబేలు పేరు జోనాథన్. ఇప్పుడు అది సుమారు 194 ఏళ్లు ఉంటుందని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అంచనా వేసింది. సుమారు రెండు శతాబ్ధాలకు చేరుకున్న ఆ జంతువు ఎన్నో చరిత్రాత్మక సందర్భాలకు సాక్షీగా నిలిచింది. వయసు మీరినా ఆ తాబేలు మాత్రం ఆరోగ్యకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. వెటరర్నీ డాక్టర్లు దాని ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారు. అయితే వయసు రీత్యా ఆ తాబేలుకు కంటి చూపు మందగించింది. వాసన గుర్తుపట్టే గుణాన్ని కూడా కొంత కోల్పోయినట్లు తెలుస్తోంది.

# చైన్నైలో దారుణం..

**-17 ఏండ్ల విద్యార్థినిపై సామూహిక లైంగిక దాడి**


**న్యూఢిల్లీ: జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



చైన్నైలో దారుణం చోటు చేసుకుంది. 17 ఏండ్ల బాలికపై(17-ఎమ్మతీ-శీశ్రీన ర్బనవత్) ఆరుగురు వ్యక్తులు సామూహిక లైంగిక దాడికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల పరీక్షల్లో ఫెయిల్ అయిన సదరు విద్యార్థిని మళ్లీ పరీక్షలు రాసేందుకు సన్నద్ధమవుతున్నది. ఈ క్రమంలో చదువుకునేందుకు స్నేహితురాలి ఇంటికి వెళ్లిన బాలికపై ఆమెకు తెలిసిన స్నేహితుడు కన్నేసాడు. మాయమాటలు చెప్పి బైక్ ఎక్కించుకొని పోరూరు సమీపంలోని కెరుగంబాక్కం ప్రాంతంలో లైంగిక దాడికి పాల్పడ్డారు.అప్పటికే అక్కడి కి చేరుకున్న మరో ఐదుగురితో కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టి పారిపోయారు. తీవ్ర అస్వస్థతకు గరైన బాలికను ఏమైందని తల్లిదండ్రులు ఆరా తీయగా తనపై జరిగి ఘోరాన్ని వివరించింది. వెంటనే బాలిక తల్లిదండ్రులు పోరూర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికను చికత్స కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

# వెనిజులాలో మరోసారి భూకంపం

**న్యూఢిల్లీ: జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



వెనిజులాలో మరోసారి భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 4.9గా నమోదైంది. రెండు రోజుల క్రితం వరుసగా సంభవించిన రెండు భారీ భూకంపాల ధాటికి దేశంలో తీవ్ర విధ్వంసం చోటుచేసుకుంది. ఈ విపత్తులో 920 మంది మృతి చెందగా, 3 వేల మందికి పైగా గాయపడ్డారు. శిథిలాల కింద ఇంకా పలువురు చిక్కుకుపోయి ఉండొచ్చనే అనుమానంతో సహాయక బృందాలు యుద్ధ ప్రాతిపదికన రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగిస్తున్నాయి. తాజా భూకంపంతో ప్రజల్లో మరోసారి భయాందోళనలు నెలకొన్నాయి.

# సుదీర్ఘ సేవలకు ఘన వీడ్కోలు

**- నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన బూసిరెడ్డి వెంకట్రామ్ రెడ్డి సేవలు చిరస్మరణీయం**

**- డీఈఓ రమేష్ కుమార్**



**కల్వకుర్తి, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా సుదీర్ఘకాలం విశిష్ట సేవలందించిన బూసిరెడ్డి వెంకట్రామ్ రెడ్డి ఉద్యోగ విరమణ పొందుతున్నారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సభ జరిగింది.జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ, "నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసిన వెంకట్రామ్ రెడ్డి సేవలు చిరస్మరణీయాలు. ప్రతి ఫైల్‌ను నిబంధనలకు అనుగుణంగా వేగంగా పరిష్కరించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది" అని కొనియాడారు.కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య, అసిస్టెంట్ కమిషనర్ రాజశేఖర్ రావు, పర్యవేక్షకులు నాగేందర్, సుజాత, టెక్స్ట్‌బుక్ మేనేజర్ నరసింహులు, సెక్టోరియల్ అధికారులు శోభారాణి, కిరణ్ కుమార్, వెంకటయ్య, నూరుద్దీన్, షర్ఫుద్దీన్, వెంకటేశ్వర శెట్టితో పాటు జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఎస్సీ కార్పొరేషన్ దుకాణాల కేటాయింపు

**కల్వకుర్తి, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలో నిర్మించిన దళిత షాపింగ్ కాంప్లెక్స్‌ని దుకాణాలను అప్పటి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆధ్వర్యంలో పూర్తి పారదర్శకంగా 34 మంది నిరుద్యోగ దళిత యువతీ, యువకులకు కేటాయించడం జరిగిందని సీనియర్ న్యాయవాది మల్లెపల్లి జగన్ తెలిపారు.దశాబ్దాలుగా కలగానే మిగిలిపోయిన ఈ దుకాణ సముదాయం ఇటీవల రికార్డు స్థాయిలో నిర్మాణం పూర్తి చేసుకుని లబ్ధిదారులకు అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కల్వకుర్తి పట్టణం మరియు మండల పరిధిలోని అర్హులైన నిరుద్యోగ దళిత యువతను గుర్తించి నిష్పక్షపాతంగా షాపులు కేటాయించారని ఆయన వివరించారు.
దుకాణాలు పొందిన లబ్ధిదారులు తమకు స్వయం ఉపాధి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మల్లెపల్లి జగన్ మాట్లాడుతూ, "ప్రభుత్వం కల్పించిన ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిజాయితీగా, అంకితభావంతో వ్యాపారాలు నిర్వహించాలి. మీ కృషి, పట్టుదలతో ఆర్థికంగా ఎదగడమే కాకుండా, మరో పది మందికి ఉపాధి కల్పించి సమాజానికి ఆదర్శంగా నిలవాలి" అని ఆకాంక్షించారు.లబ్ధిదారులు మరిన్ని షాపులు నిర్మించి, మొదటి మరియు రెండవ అంతస్తులను కూడా అభివృద్ధి చేసి, మిగిలిన అర్హులైన నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# కల్వకుర్తిలో ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాల కేటాయింపుపై నిరసనలు

**కల్వకుర్తి, జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**




ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో నిర్మించిన ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలను నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు కేటాయించారని ఆరోపిస్తూ అర్హులైన దళిత నిరుద్యోగులు గత రెండు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షకు బహుజన్ సమాజ్ పార్టీ కల్వకుర్తి అసెంబ్లీ యూనిట్ మద్దతు ప్రకటించింది. అసెంబ్లీ ఇంచార్జి ఎట్టి ఆంజనేయులు మాట్లాడుతూ, "250 మంది అప్లై చేసిన వారందరి పేర్లను చిట్టి రూపంలో విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు.జిల్లా అధ్యక్షుడు రాంచందర్ మాట్లాడుతూ, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది బంధువులకు దుకాణాలు కేటాయించగా, ఏళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులైన దళిత అభ్యర్థులను పక్కన పెట్టారని ఆరోపించారు. రాజకీయ పలుకుబడి ఉన్నవారికి ప్రాధాన్యం ఇచ్చి కేటాయింపులు జరిపారని ఆయన పేర్కొన్నారు.బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు అక్రమ కేటాయింపులను వెంటనే రద్దు చేసి, పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులకు దుకాణాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో బాధితులు నిరటి మల్లష్, గోరటి వెంకన్న, కేశవులు, బీఎస్పీ జిల్లా నాయకులు కళ్యాణ్ శ్రీను, కృపానందం పాల్గొన్నారు.

# షోయబ్ అక్తర్ సోదరుడి అంత్యక్రియలకు ఉగ్రవాదులు హాజరు.

**పహల్గాం దాడి సూత్రధారి కూడా**

**న్యూఢిల్లీ: జూన్ 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాక్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ వివాదంలో చిక్కుకున్నాడు. షోయబ్ సోదరుడు షాహిబ్ అక్తర్ అంత్యక్రియలు ఇస్లామాబాద్‌లో జరిగాయి. ఈ కార్యక్రమానికి నిషేధిత సంస్థలకు చెందిన ఉగ్రవాదులు హాజరవ్వడం సంచలనంగా మారింది. వారిలో పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి సహా లష్కర్ ఎ తయిబాకు చెందిన ఉగ్రవాదులు పాల్గొన్నారు. అలాగే, స్థానిక రాజకీయ నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈ నేపథ్యంలో పాకిస్తాన్‌లో ఉగ్రవాదులకు, స్థానిక రాజకీయ నాయకులకు, క్రీడాకారులకు మధ్య ఉన్న సంబంధాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. ఉగ్రవాదులు బహిరంగంగానే తిరుగుతున్నా అక్కడి ప్రభుత్వం మాత్రం ఉగ్ర సంస్థలతో తమకేం సంబంధం లేదని ప్రకటిస్తూ ఉంటుంది. ఇక, తాజా అంశానికి సంబంధించి షోయబ్ సోదరుడు షాహిబ్ అక్తర్ అంత్యక్రియలకు



లష్కర్ ఇ తయిబా డిప్యూటీ చీఫ్ సైఫుల్లా కసూరి హాజరయ్యాడు. గత ఏడాది కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి సూత్రధారుల్లో అతడు ఒకడు. ఈ దాడి తర్వాత కూడ సైఫుల్లా కసూరి భారత్‌కు పలుమార్లు హెచ్చరికలు జారీ చేశాడు. 26/11 తరహా దాడులు భారత్‌లో మళ్లీ నిర్వహిస్తామని హెచ్చరించాడు. లష్కర్ ఇ తయిబా సంస్థను ఐక్యరాజ్య సమితి ఉగ్రసంస్థగా గుర్తించి, నిషేధించింది. ఈ సంస్థ వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ తనయుడు తల్హా సయీద్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాడు. అతడు కూడా ఈ సంస్థలో పని చేస్తున్నాడు. అలాగే నిషేధిత ఉగ్ర అనుబంధ సంస్థ పాకిస్తాన్ మర్కాజి ముస్లిం లీగ్ (పీఎంఎంఎల్) సభ్యులు కూడా హాజరయ్యారు. ఇటు ఉగ్రవాదులు, స్థానిక రాజకీయ నేతలు అంత్యక్రియలకు హాజరవ్వడం ద్వారా ఉగ్రవాదులకు పాక్ ఏ విధంగా సహకరిస్తుందో అర్థమవుతోంది. ఈ విషయంపై భారత్ ఎప్పటినుంచో విమర్శలు చేస్తోంది. ఉగ్రవాదుల కేంద్రంగా పాక్ తయారైందని, వారిని ఆ దేశం రహస్యంగా కాపాడుతోందని పలు అంతర్జాతీయ వేదికలపై వెల్లడించింది.

# నీలగిరి సాహితీ సంగమం – 11

## స్వప్న ప్రకరణము 5

ఆ వె
సర్వ స్ఫురణ యున్న జాగృతావస్థయు
జాగృతందు నూహ స్వప్న స్థితియు
నిండు కలలు గలుగు నిద్ర యందు నెపుడు
నసలు గాఢ నిద్ర యగు సుషిప్తి

ఆ వె
మనిషి యుండు గాని మనలోన నుండడు
పగటి కలలు కనుచు బరగు చుండు
పలుకరించి చూడ బలుకడు నిసుమంత
స్వప్న స్థితిని యుండు జాగృతమున

ఆ వె
విషయ జ్ఞాన మరయు విష యేంద్రి యములన్ని
సుప్త చేతనమున సోయి వీడ
మనసు మాత్రముండి తనయొక్క పనిజేయ
కలుగుచుండు కలలు కమ్మగాను

సత్యనారాయణ బొలిశెట్టి,
హైదరాబాద్

## అమ్మ

కందములు

వెలిగెడి దీపము వంటిది
చిలికిన వెన్నవలెనుండు చిత్తము నందున్
లలిని కలిగినమ్మ యెపుడు
కళకళ లాడుచు గృహమున కాచును సంతున్!

హంగును జూపని యమ్మగ
కొంగును సంతుకు నిలుపగ గొడుగు వలెననా
చెంగగు నూయల నూగగ
నింగిని తాకుచు సుఖముగ నిద్దుర బుచ్చున్!

నిండుగ తొణికెడు నగవున
మెండుగ తనసంతు కొరకు మిక్కిలి దయతో
దండిగ నోర్మిని జూపుచు
నండగ నిలబడు నిజముగ నమ్మే కదరా!

ఒద్దికగ నొడిని జేరగ
ముద్దుగ సాకుచు దనయుల ముచ్చట తీర్చున్
సుద్దులు నేర్పుచు వారికి
హద్దులు తెల్పెడి గురువగు నమ్మే తానై!

కానుకొలను లక్ష్మీసీత

## విద్య

ఆ.వె.
విద్యలందవలయు వినయము తోడను
గురువునాజ్ఞబడసి కూర్మిమీర
విద్యయశము నిచ్చు వేదన తొలగించు
సుజన వర్గమందు చోటునిచ్చు.

ఆ.వె.
చదువులందు మహిమ చక్కగానందుచు
బద్ధకమ్మువీడి బరగవలయు
చదువు వెలుగునిచ్చు సంతోషమిచ్చును
చదువురానివాడు చవటసుమ్మి.

ఆ.వె.
మంచిచెడులు తెలుపు మాన్యత నొనగూర్చు
చేటుతొలగజేయు శ్రేయమిడుచు
చెరకువంటితీపి చేకూరుమనమున
చదువుసర్వమిడును సంతతమ్ము.

ఆ.వె.
జ్ఞానమరసినంత జ్ఞానుల బోధల
విలువలరయవలయు విలువ పెరుగు
కన్నవారి నెపుడు గాంచుము ప్రేమతో
పెద్దవారిపట్ల ప్రీతిజూపు.

అవధానిని.గాయత్రీదేవి

## "దంపతులు"

ప్రక్రియ: కంద పద్యములు

ఇరువు రపరిచితులు కలిసి
వరముగ దంపతులగు, విధి ప్రాకృతమగుచున్,
గురుతర బాధ్యతఁ దాల్చుచు
చిర పరిచితులుగ నగుట విచిత్రము కాదే!

భిన్న పరిస్థితులందు వి
భిన్న తలంపుల నొకటిగ వీలు పఱచుచున్,
దన్నుగ నొకరికొకరు నిలు
చెన్నుగ సహజీవనము విచిత్రము కాదే!

గూటిని విడు పక్షుల పరి
పాటిగ సంతు విడిపోవ ప్రారబ్ధముగన్,
వాటుకి ముదుసలిలు మిగుల
చేటగు నంత్య సమయము విచిత్రము కాదే!

వేగరాజు సాయి వర ప్రసాద్, హైదరాబాదు

## Time is gold అనెడి సామెత ఆధారంగా

మంజరీ ద్విపద:

తెలుసు కో మిత్రమా తెలివితో నీవు సమయపు విలువను
సతతము నెరుగు,
గడచిన సమయము కదలి రాదెపుడు,
మాటలు,చేతలు మార్చుకు నీవు
సమయము మలుచుకు సానుకూలముగ,
ముందుకు నడచిన మోదము కలుగు,
సర్దు బాటు తనమే సత్ఫలిత మిడు,
దిద్దు బాటెపుడు దిగ్విజయ మిడు,

వసుమతీ జగన్నాథం

## ..నాన్న...

ఆ!!
కొబ్బరంటి మనసు కొండంత ప్రేమనే
దాచు నెపుడు తాను తపన తోడ,
కష్టమెంతయైన యిష్టమే
చూపుచూ
నాన్న శ్రమలకోర్చి నన్ను మలచె..!!

ఆ!!
మదినిబాధదాచు మమతనేదాచునే
కంటినీటిదాచు పంటిబిగువు
కష్టనష్టములను కడగండ్లు దాచునే
కన్న వారి భవిత కలలు దీర్చ..!!

ఆ!!

అమ్మనాన్నలనిన యాదిదంపతులంద్రు
యంతరంగమెఱిగి యాదరించ
నడుచుకొనుచువారు నాత్మీయతను పంచ
నిత్య శుభము కల్గు నీదు గృహము!

కం.
వెలకట్టలేని ప్రేమల
యలుపనునదిలేక తాను
నాలంబనగా
కలగను పిల్లల భవితను
విలువలు తానేర్పు"నాన్న"
వేలుపు గురువై...!!

...గవిచర్ల వేంకట దుర్గా ప్రసాద్ శాస్త్రి...
హైదరాబాద్

## "ప్రపంచయోగాదిన శుభాకాంక్షలు!"

(తెలుగు గజల్: )

యోగాసన దినచర్యల కుశలాలకు చేటు లేదు!
ప్రాణాయామ పెన్నిధికి తలవంచని జబ్బు లేదు!

సూర్య నమస్కార విధులు సంజీవిని ఔషధాలు!
ఫార్మసీల ప్రదక్షిణల బేజారుకు చోటులేదు!

మందులేని మనోవ్యాధి కోరలలో కొత్త తరం!
శ్వాసపైన ధ్యాస కుదర ప్రశాంతతకు లోటు లేదు!

పార్లర్లూ జిమ్ములంటు ప్రయాసలల ప్రహసనాలు!
ఆసనాలు వేసుకుంటె అందాలకు తరుగులేదు!

అదుపులేని ఇంద్రియాల విలాసాల విన్యాసం!
స్థిర చిత్తపు యోగికులకు చపలత్వం బెదురు లేదు!

సనాతనపు సంస్కృతితో సావాసమె ఒక యోగం!
విశ్వానికి భరతజాతి ఆదర్శం తిరుగులేదు!

అంజలిడక పతంజలికి అప్పేవిధి తీరు కుసుమ?
యోగాడే తెప్పించిన మనమోడీ కెదురులేదు!

కుసుమ ఉప్పలపాటి

## పెద్దపీట

సీసం:
నెర్రెలు బాసిన నేలలు బావురు
మనుచుండ జనుల మనసు గెలువ!
దుక్కులు రైతులు దున్నగ చిక్కులు
బాపెద నంచును బయలుదేరె!
పురమును యేలెడి దొరలంత చెప్పిరి
మేలైన మాటలు మేధిలోన!
మాటలు కోటలు దాటెడి రీతిగా
కోతలు కోసిరి నేతలంత!

ఆ. వె:
రైతు బాగు కొరకు రయముగా వచ్చాము
అనుచు చెప్పి నారు అవనిలోన!
నిండు సభను జూసి నిజము నమ్ముమనుచు
పేరు చెప్పి వేసె పెద్ద పీట!

డా. హరికిషన్ యర్ర, తుంగతుర్తి

## శీర్షిక : పొడుపు విప్పవమ్మ! బుట్టబొమ్మ!

ప్రక్రియ :- పద్యం(ఆటవెలది)

01
భారతమున బుట్టె బంగారు నది తాను
గంగ చెల్లెలంద్రు!గౌతమి యని
తనదు నాసిక విడి ధవళేశ్వరము జేరు
పొడుపు విప్పవమ్మ!బుట్టబొమ్మ!
జవాబు:- గోదావరి

02
మంచి నదిగ తాను మహ రాష్ట్రమున బుట్టె!
తెలుగువారి తృష్ణ దీర్చెనది; మ
హాబలేశ్వరు విడి హంసలా 'దివి' జేరె
పొడుపు విప్పవమ్మ! బుట్ట బొమ్మ!
జవాబు:- కృష్ణ

03
అమర పురిన యాడు నందాల నదితాను
పరమశివుని జేరి పత్ని యాయె!
జారె భువికి తను భగీరథుడు బిలువ
పొడుపు విప్పవమ్మ! బుట్టబొమ్మ!
జవాబు :-గంగ

వరలక్ష్మి యనమండ్ర
హైద్రాబాద్

## శీర్షిక..త్యాగధనులు

ఆటవెలదులు

జన్మ నిచ్చి తల్లి జగతినే జూపించు
నడత నేర్పు గురువు నాన్న మనకు
తల్లిదండ్రులన్న తరగని సిరులేగ
కనుల ముందు తిరుగు ఘనులె వారు!

తల్లి దండ్రులనగ దైవరూపు మనకు
తరువు వలెను గొప్ప త్యాగధనులు
నాశలన్ని నిలుపు నాప్యాయతను బంచు
బిడ్డ బాగు కోరు ప్రియతములును!

తాము తినక కుడుపు తనయులకును వారు
కష్టసుఖములందు గాచుచుండు
నద్భుతంబె యిలన యమ్మనాన్నలెపుడు
ప్రాణమోలె చూచి ఋణము దీర్చు!

కొంటికర్ల లలిత

## శీర్షిక: సర్వే జనా...

మనలో ఉన్న పరమాత్ముని చూడలేక
అన్ని దేవాలయాలకు వెళ్ళడం
మన చుట్టూ ఉండేవారిలో మంచిని చూడక
అందరినీ ద్వేషించడం
శరీరానికి వ్యాయామం అవసరం అని తెలియక
డాక్టర్ల చుట్టూ తిరగడం
నోటిని అదుపులో ఉంచుకోవడం చేతకాక
అందరినీ ఆడి పోసుకోవడం
అదుపుతప్పిన ఆగ్రహాన్ని నింపాదిగా అణచక
అందరిపై చిందులు తొక్కడం
లోపాలన్నీ మనలో ఉంచుకొని పరోపకారిని
నేనేనని ఎలుగెత్తి చాటడం
కొద్దిపాటి విచారణతో మనలని మనం సంస్కరించుకుంటే
అందరితో ఆహ్లాదంగా ఆరోగ్యంగా ఉంటాం
నూరేళ్ళ జీవన మాధుర్యాలను తనివితీరా అనుభవిస్తూ
సర్వే జనా సుఖినోభవంతు అంటూ చాటుదాం

శశిశేఖర్ అల్లంకి
ఏలూరు

## అగస్త్యుడు

ప్రక్రియ పద్యము

తే.గీ.
సప్త ఋషులలో నొక్కరు చక్కనైన
భారతీయభాషల మేటి పండితుండు
వేదవేదాంగ విజ్ఞాన విబుధుడతడు
మాన్యవరుడగస్త్యుడు ఘనమహిని గనగ

తే.గీ.
వింధ్యపర్వత మెత్తుకు పెరిగి, సూర్య
గమనమున కడ్డుగా నిల్వ గాంచి నంత
తొలగమని చెప్పి వేల్పుల దిగులు దీర్చి
దక్షిణ దిశగా పయనించి దారిజూపె

తే.గీ.
పంచపాది
కామరూపపు విద్యతో గన్నుగప్పి
ఇరువురు గలసి వాతాపియిల్వలుడును
బాటసారుల నత్తరిన్ బాధ పెట్ట
తనతపోశక్తితోడ నంతమును జేసి
వారిని ముదము గూర్చెను వసుధలోన

మాతా గంగాభవాని శాంకరీ దేవి
చెన్నై

## వాసవాంబ

ఆటవెలది

నీతిలేనివారి నీడనుండగబోకు
గర్వమున్నవారి గడపచొరకు
ఆడితప్పువారి నంచుకురానీకు
"వాసవాంబపుత్ర వైశ్యరత్న!

నవ్వుచుండుమెపుడు నలుగుర్ననవ్విస్తు
అవనిసాగుమోయి ఆత్మబంధు
పాడురోగములకు పాశుపతమునవ్వు
"వాసవాంసపుత్ర వైశ్యరత్న"

అప్పుచేసి జనులు పప్పుకూడునుతిన్న?
తిప్పలెంతొకలుగు తీర్చునపుడు
అప్పులేనిగంజి దొప్పెడు చాలయా
"వాసవాంబపుత్ర వైశ్యరత్న!"

పుల్లూరి నాగేశ్వర్ కవి భూపాలపల్లి జిల్లా

## నీలి మబ్బు

నీలి మబ్బు కురవదేమి
నీటి చుక్క నొదలదేమి
భూమి విచ్చుకొని చూచి
ఎర్రబడ్డది ఎండిపోయి

ఎగిరిపోయే మబ్బులార
నిముష మాగి నలిచి
వేడి నిట్టూర్పుల ధరణి
వేదన తీర్చు జలమిచ్చి

ప్రాణికోటి తపనతీర
భూమి పులకించగ
భారమిట ధారపోసి
పైకెగరి త్రాగిరావోయి
సాగరజలమంతయు

వేమూరి హనుమంతరావు
హైదరాబాద్

## చెలిమి

తే.గీ.

పూల పరిమళ మెపుడైన పోవు నేమొ
గతిని తప్పి తిరుగ వచ్చు కాల మైన
కరుణ హస్తము నందించి కలిమి నొసగి
విడువక నిలిచి స్నేహము వెలుగు పంచు

తే.గీ.

ఆపదందు విడువ నట్టి యాత్మబంధు
కష్ట కాలమున నిలిచి కరము నొసగి
వెతలు బాధించు వేళల వెంట నిలిచి
చెలిమి తోడుగా నిలుచును జీవితమున

తే.గీ.

చేత సొమ్మున్న జనులెల్ల చెంత జేరి
ధనము దూరమై పోవగ దరికి రారు
వెలకు నెవ్వరు కొనలేని విలువ కలిగి
సహజ చెలిమియే నిజమైన సంపదెపుడు

మరింగంటి శ్రీనివాస్
హైదరాబాద్

## ఆటవెలది

అమ్మచేతిబొమ్మ నందాల బాలుడు
విఘ్నరాజు వీడు వీతభయుడు
సకల శుభము లిడును సజ్జనుల కిలలో
ఆదిపూజ్యుడితడు హస్తిముఖుడు

శర్వాణి పాతూరి

## శీర్షిక!! విలువైన విద్య

సీ!!

నవధాన్యములలోన నాణ్యత గలిగిన
విత్తనాలేవన విద్యయొకటె!!
షడ్రుచులందున చక్కనిదేదన
విలువల నిచ్చెడి విద్య యొకటె!!
తల్లిదండ్రి గురువు దండిగ నొసగెడి
విత్తమేదన్న యా విద్య యొకటె!!
కదనరంగము నందు కాలుని యప్పుడు
విజయమ్ము నిచ్చేది విద్య యొకటె!!

తే!!గీ!!

సకల లోకమ్ములందున సాటిలేని
విశ్వనరులెల్ల కోరెడి విద్య యొకటె!
పట్టి చదవంగ మీరంత పట్టుదలగ
ప్రభుత బడి పిల్చుచుండెను లక్ష్యమెరిగి
పరుగు పరుగున రారండి బాలలార!!

గడ్డం కృష్ణారెడ్డి.రేపాల సూర్యాపేట!!

## ఆ ఐదు రూపాయలు

స్కూల్‌కి వెళ్తూ "ఐదు రూపాయలు కావాలి" అన్నాను, నాన్న జేబులో వెతికాడు... ఒక్క రూపాయి కూడా లేదు.

"సాయంత్రం ఇస్తాను రా" అని నవ్వాడు, కానీ ఆ నవ్వు వెనుక బాధ నాకు కనిపించలేదు.

సాయంత్రం వచ్చి ఐదు రూపాయలు ఇచ్చాడు, నేను ఆనందంగా తీసుకున్నాను.

ఏళ్ల తర్వాత తెలిసింది... ఆ రోజు మధ్యాహ్నం నాన్న భోజనం చేయలేదని.

అప్పుడు అర్థమైంది... ఆ ఐదు రూపాయలు డబ్బు కాదు, నాన్న ఆకలికి పెట్టిన ధర.

--- శివ, రుద్రసముద్రం

## నిజమైన ఎదుగుదల

..................................
సమయాన్ని బట్టి కాలం మారుతుంది
కాలాన్ని బట్టి వాతావరణం మారుతుంది
వాతావరణాన్ని బట్టి మనుషులు మారుతారు
మనిషిలో వచ్చే ఆ మార్పే "ఎదుగుదల"!
?ఎదుగుదల అంటే శారీరక మార్పు మాత్రమే కాదు
అది ఆలోచనల్లో వచ్చే మానసిక వికాసం...
వయసుతో పాటే జ్ఞానమూ పెరుగుతుంది
ఆ జ్ఞానాన్ని బట్టే స్థాయి కూడా మారుతుంది.
?జ్ఞానం పెరుగుతున్న కొద్దీ
ఎంత నేర్చుకుంటే అంత మంచిది...
కానీ నీ ఎదుగుదల చూసి ఓర్వలేక
తొక్కేయాలని చూస్తుంది ఈ సమాజం!
?అయినా సరే... నువ్వు చేసే పనులు స్వార్థం వీడి
సమ సమాజ శ్రేయస్సు కోరేలా ఉండాలి...
నలుగురు వేలెత్తి విమర్శించేలా కాకుండా
ఒక్కరైనా నిన్ను గుండెల్లో పెట్టుకునేలా ఉండాలి.
?నిన్ను నువ్వు ఎలా మార్చుకున్నావన్నదే
నీయొక్క నిజమైన ఎదుగుదల..

జి. అరుణ్ కుమార్,
బి. టెక్. సెకండ్ ఇయర్,
వరంగల్.

## ఆటవెలది

మనసునొకటి యుండు మాటలింకొకతీరు
మనుషినెపుడు కూడ నమ్మరాదు
అన్నిజన్మలందునున్నత జన్మమ్ము
అనచునుండు గాని అధమముండు.

కశోర్ఘుల నాగేశ్వర్ శర్మ,
ధర్మపురి.

# ఇరుముడి కట్టు పాట 29న విడుదల




మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ డ్రామా 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్‌ను చిత్ర బృందం ప్రకటించింది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'ఇరుముడి కట్టు' పాటను జూన్ 29వ తేదీన ఉదయం 11:07 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, సాయి కుమార్, బేబీ నక్షత్ర, విష్ణుశర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాలో రవితేజ సరికొత్త డివోషనల్ లుక్‌లో కనిపించనున్నారు. ఒక తండ్రి, కూతురి మధ్య ఉండే ఎమోషనల్ బాండింగ్, అయ్యప్ప స్వామి మాల ధారణ ద్వారా ఒక వ్యక్తి జీవితంలో వచ్చే ఆధ్యాత్మిక మార్పుల చుట్టూ ఈ కథ తిరగనుంది. రవితేజ కెరీర్‌లోనే ఇదొక విభిన్నమైన చిత్రంగా నిలవబోతోంది.



గోల్డెన్ కలర్ డ్రెస్సులో టాలీవుడ్ 'రాధిక' నేహా శెట్టి మెరిసిపోతోంది. తన హాట్ హాట్ అందాలను ఆరబోస్తూ ఆమె చేసిన లేటెస్ట్ ఫొటోషూట్ నెట్టింట సెగలు రేపుతోంది. గ్లామరస్ లుక్స్‌తో పాటు కిల్లింగ్ పోజులతో కుర్రకారుకు పిచ్చెక్కిస్తున్న ఈ బ్యూటీ అందాల విందు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

## నెటెడ్ డ్రెస్సులో నేహా శెట్టి గ్లామర్ అటాక్..

# ట్రోలింగ్ భయంతో.. నోరు విప్పలేకపోతున్నా..

ట్రోలింగ్..! సోషల్ మీడియా ఓపెన్ చేస్తే చాలు.. కనిపించేది ఇదే! అయితే ఇక్కడ సాడ్ రియాల్టీ ఏంటంటే... చాలా మంది నెటిజన్లు దీన్ని ఎంటర్‌టైన్మెంట్‌గానే చూస్తున్నారు. ఓ సెలబ్రిటీ పై జరిగే ట్రోలింగ్ కూడా ఎంజాయ్ చేస్తున్నారు. షేర్ చేస్తున్నారు. అదే ట్రోలింగ్ కు గురైన సెలబ్రిటీ మాత్రం.. తెలియని భయంలోకి జారుకుంటున్నారు. ఇప్పుడు రష్మిక మందన కూడా... ట్రోలింగ్ భయానికి గురయ్యారు. ఇదే విషయాన్ని తనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. ఎట్ ప్రజెంట్ బాలీవుడ్ కాక్ టెయిల్ 2 సినిమా చేసిన రష్మిక మందన.. ఆ సినిమాకు వస్తున్న రెస్పాన్స్‌తో హ్యాపీగా ఉంది. ఈక్రమంలోనే తన సినిమాకు మరింత ప్రచారం కల్పించేందుకు ఓ ఇంటర్వ్యూకు వెళ్లింది. అక్కడ ట్రోలింగ్ భయంతో తాను ఏం మాట్లాడలేకపోతున్నా అంటూ ఎమోషనల్ అయింది. ఎప్పుడు ఏం మాట్లాడాలన్నా భయం వేస్తుంది..మనం ఏం మాట్లాడినా.. అది వేరే విధంగా వెళ్తుంది. తాను అనని విషయాలను కూడా అన్నట్టు ప్రచారం చేస్తున్నారు. మన గురించి ఎలాంటి రూమర్ వస్తుందో అని రోజూ భయంతో గడపాల్సిన పరిస్థితి వచ్చింది. సోషల్ మీడియా మంచిదే కానీ దాన్ని కొందరు తప్పుగా వాడుతున్నారు అని అంటూ రష్మిక మందన ఎమోషనల్‌గా చెప్పుకొచ్చింది. ఇప్పుడు ఈమె మాటలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ట్రోలింగ్ సెలబ్రిటీలను ఎలా బాధిస్తుందనేది అందరికీ తెలిసేలా చేస్తో



# ఇడుపు కాయితం సినిమా టైటిల్‌పై రచ్చ

### టైటిల్ మార్చేది లేదన్న దర్శకుడు బన్నీవాసు




ఒక సినిమా విడుదలైన తర్వాత అందులోని పాత్రలు, సన్నివేశాలు, సంభాషణలపై చర్చ.. వివాదాలకు దారి తీయడం ఇప్పటివరకూ చూశాం. ఇటీవల కాలంలో టైటిల్‌తోనే చర్చకు దారితీసిన మూవీ 'ఇడుపు కాయితం'. సోషల్ మీడియాలో పనిగట్టుకుని కొందరు పెట్టిన పోస్టులు వివాదానికి దారితీశాయి. సినిమా భాష, యాస, టైటిల్స్ విషయంలో రెండు వర్గాలుగా విడిపోయి.. ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలకు దిగారు. ఈ క్రమంలో చిత్ర నిర్మాత బన్ని వాస్ స్పందించారు. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదని, కథను బట్టే టైటిల్ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వివాదం నేపథ్యంలో టైటిల్, కథను మార్చే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఏ సినిమాకైనా కథ, దాని నేపథ్యం బట్టే టైటిల్ ఉంటుంది. దీనిపై ఇక చర్చ అనవసరం. షూటింగ్ పూర్తయి విడుదలైన తర్వాత సినిమానే మాట్లాడుతుంది. ఆంధ్రా, తెలంగాణ ఎవరైనా సరే సినిమా నచ్చితేనే చూస్తారు. నచ్చకపోతే చూడరు. నేను చేయాల్సింది సినిమాను బాగా తీయడంపై దృష్టి పెట్టడమే. ప్రస్తుతం ఈ వివాదం వల్ల సినిమాకు కొంత ఇబ్బంది కలిగిన మాట వాస్తవం. రేపు సినిమా బాగుంటే అన్నీ సర్దుకుంటాయి. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదు. నాకు పూర్తి నమ్మకం ఉంది. దర్శకుడు వచ్చిన ప్రాంతం, చూసిన వాస్తవ సంఘటనల నుంచి రాసుకున్న కథ ఇది అన్నారు. ప్రియదర్శి, నాగదుర్గ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి వంశీరెడ్డి దొండపాటి దర్శకుడు. ఇడుపు కాయితం అంటే విడాకుల పత్రం.. భార్యాభర్తలు విడిపోవడానికి పెద్దల సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పంద పత్రం. ఇప్పుడు దంపతులు విడిపోవాలనుకుంటే కోర్టులు చుట్టూ తిరుగుతున్నారు. కానీ, కొద్ది కాలం కిందట కలిసి బతకలేమని నిర్ణయించుకున్న దంపతులు పెద్ద మనుషుల సమక్షంలో విడిపోవడానికి ఒక ఒప్పందం చేసుకునే వారు. దీన్నే ఇడుపు కాయితం అని పిలిచేవారు. ఇప్పటికీ తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇడుపు కాయితం రాసుకొని విడిపోతున్న జంటలున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తున్న పదాల్లో 'ఇడుపు కాయితం' ఒకటి. ప్రియదర్శి హీరోగా తెరకెక్కుతున్న కొత్త సినిమా టైటిల్‌గా ఈ పదాన్ని ప్రకటించిన తర్వాత దీనిపై పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. కొందరు ఈ పదానికి అర్థం ఏమిటని వెతుకుతుండగా, మరికొందరు దీనిపై సోషల్ మీడియాలో చర్చలు, వాదోపవాదాలు మొదలుపెట్టారు. దీంతో 'ఇడుపు కాయితం' అనే పదం ఒక్కసారిగా ట్రెండింగ్‌లోకి వచ్చింది.



# మైత్రీ మూవీ మేకర్స్‌లో నవీన్ పోలిశెట్టి

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నవీన్ పోలిశెట్టి తన తదుపరి క్రేజీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నాడు. 'అనగనగా ఒక రాజు' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, వంద కోట్ల క్లబ్‌లో చేరి తన మార్కెట్ స్టామినాను నిరూపించుకున్న నవీన్.. తన కొత్త సినిమాను లైన్‌లోపెట్టాడు. అగ్ర నిర్మాణ సంస్థ అయిన మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతుంది. నవీన్ పోలిశెట్టి మార్కెట్ పరిధిని దృష్టిలో ఉంచుకుని ఈ కలయికపై మైత్రీ సంస్థ చాలా నమ్మకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రాకముందే నవీన్ పోలిశెట్టి సోషల్ మీడియా వేదికగా చేసిన ఒక వినూత్న ప్రమోషన్ ప్రస్తుతం నెట్టింట సంచలనంగా మారింది. సినీ ఇండస్ట్రీలోని నలుగురు టాప్ కమర్షియల్ డైరెక్టర్స్ ప్రశాంత్ నీల్, సుకుమార్, లోకేష్ కనగరాజ్, మరియు రిషబ్ శెట్టిలతో కలిసి దిగిన ఒక అదిరిపోయే ఫన్నీ రీల్‌ను ఆయన షేర్ చేశాడు. ఈ దర్శకుల సినిమాల బాక్సాఫీస్ వసూళ్లను ఉద్దేశిస్తూ.. దీనిని తన కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన 'రూ. 5000 కోట్ల ఫ్రేమ్' అని నవీన్ చమత్కరించాడు. ఈ వైరల్ వీడియో ద్వారా మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో తన తదుపరి చిత్రం రాబోతోందని నవీన్ క్లారిటీ ఇచ్చాడు. దీనికి స్పందనగా మైత్రీ మూవీ మేకర్స్ కూడా నవీన్‌ను తమ ప్రొడక్షన్ ఫ్యామిలీలోకి ఆహ్వానిస్తూ.. ఒక ఫుల్-ఆన్ ఎంటర్‌టైనర్ లోడింగ్ అవుతోందని వెల్లడించింది. అయితే ఈ సరికొత్త ప్రాజెక్ట్‌ను పూర్తి స్థాయి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించ నున్నారు. 'సైరన్' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తమిళ దర్శకుడు ఆంటోనీ భాగ్యరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు సినీ వర్గాల్లో గట్టి ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం స్క్రిప్టింగ్, ప్రీ-ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసిన చిత్ర బృందం, త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించి, వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్లాన్ చేస్తోంది. నవీన్ పోలిశెట్టి అద్భుతమైన కామిక్ టైమింగ్, ఆంటోనీ భాగ్యరాజ్ టేకింగ్, మరియు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువల కలయికలో రాబోతున్న ఈ చిత్రంపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి.